
ప్రజలే ప్రభువులు

# జనబలం

ఫిబ్రవరి 2026 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



17 A, 8 సవరణల్ని ఇప్పటికైనా రద్దు చేయండి

భారత్‌కి వెనుజువెలా పాఠం

దార్శనిక సహకార నేత రామారెడ్డికి 'పద్మశ్రీ'

ఎమర్జెన్సీ నుండి ఉద్యమాల అధ్యయనం

మున్సిపల్ 'ఎన్నికల' నిధులు



మారథాన్ బడ్జెట్









# సంక్షేమం..అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలి

## -డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్-




దేశంలో వనరుల వినియోగం సరిగా లేకపోవటం వల్లే సమస్యలు వస్తున్నాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తెలంగాణ సహా పలు రాష్ట్రాలు సంక్షేమం పేరుతో అభివృద్ధిని పణంగా పెడుతున్నాయన్నారు. 'తెలంగాణలో పరిపాలనను మెరుగుపరచటం: ఆర్థిక నిర్వహణ-సంక్షేమ పాలన' అంశంపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంక్లూజివ్ గవర్నమెంట్, హైదరాబాద్ (ఐఐజీహెచ్) ఆధ్వర్యంలో బేగంపేటలోని బీపీఆర్ విఠల్ ఆడిటోరియంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణలో పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి తీరుతెన్నుల్ని సమావేశం లోతుగా చర్చించింది. సంక్షేమం పేరుతో అనర్హులకూ పథకాలు వర్తింపచేయటం వల్ల ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయని అభిప్రాయపడింది. సమస్యల్లో ఉన్నవారికి ప్రభుత్వం అండగా నిలవాలని, అయితే.. సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించాలని జేపీ స్పష్టం చేశారు. మూలధన వ్యయాల్లోనూ అనుత్పాదక వ్యయం తెలంగాణ ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తోందన్నారు. పెట్టుబడికి, ఫలితాలకు సంబంధంలేని భారీ ప్రాజెక్టుల నిర్మాణం తగదన్నారు. అభివృద్ధి పనుల కోసం అప్పులు తప్పుకాదని, అయితే రోజువారీ ఖర్చులు (ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలు, పెన్షన్లు, తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాలు మొదలైనవి) కోసం అప్పు చేయటం ప్రమాదకరమన్నారు. ఆర్థిక క్రమశిక్షణ లేకుంటే ఇల్లయినా, రాష్ట్రమైనా దివాళా తీస్తాయన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవంతో రాష్ట్రాలఫెడరల్ ఆకాంక్షల్ని పరిగణలోకి తీసుకుని మెరుగైన కేటాయింపులు చేస్తున్నారని జేపీ పేర్కొన్నారు. వివిధ రంగాల నిపుణులు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి, సురేష్ కొచ్చాటిల్, డాక్టర్ కృష్ణారెడ్డి చిట్టెడి, మురళీమనోహర్, శ్రీనివాస్ రెడ్డి, స్త్రీ శక్తి ప్రతినిధి అంజలి, న్యాయవాది బండారు రామ్మోహనరావు, ఫణిధర్రావు, బీజేపీ నేత పేరాల శేఖర్ జీ, సీనియర్ జర్నలిస్టులు కప్పర ప్రసాద్, రావికంటి శ్రీనివాస్, పలు రంగాల ప్రతినిధులు, విద్యావేత్తలు, పలు యూనివర్సిటీల విద్యార్థులు, తదితరులు మాట్లాడారు.

# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

ఫిబ్రవరి 2026

సంపుటి 27 సంచిక 02


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్




జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.


### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





06 మారథాన్ బడ్జెట్

10 వెనిజువెలా అనుభవం నుండి భారత్ నేర్చుకోవాల్సిన పాఠాలు

16 సహకార ఉద్యమనేత మామిడి రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం

20 యంగ్ లీడర్స్ డైలాగ్ 2026 .. జిల్లా ప్రభుత్వాలు

23 మహిళా సాధికారత సంస్కరణలకు మన సంకల్పమే అవరోధం?

29 సమాజహితమే ఎన్.టి.ఆర్ నిజమైన ఆస్తి

30 పెరుగుతున్న గిగ్, ప్లాట్ ఫాం కార్మికులు..

32 2007 చైనా = 2025-26 భారత్



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజిగూడ, త్రిబువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# ఆశావహ బడ్జెట్ అందరికీ అవకాశం ఇస్తుందా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం బడ్జెట్లు సమర్పిస్తుంటాయి. ఈ బడ్జెట్‌లు కేవలం జమా ఖర్చుల లెక్కలు మాత్రమే కాదు. ప్రజల జీవితాన్ని శాసించేవి, నడిపించేవని మనం గమనించాలి. బడ్జెట్ అంటే మన కుటుంబానికి వచ్చిన ఆదాయాన్ని, పెట్టే ఖర్చును బేరీజు వేసుకున్నట్లే కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అలానే చేస్తాయి. చేయాలి కూడా. మన ఇంటి సొమ్ము బుధవారం మంది సొమ్ము మంగళవారం లాగా వృధా చేయకుండా ఉండాలి. మన సొమ్ము అయితే పొదుపు చేసి జాగ్రత్తగా ఉంటూ కుటుంబ యజమానులు ఎలా పొదుపు పాటిస్తారో ప్రభుత్వాలు చట్టసభలలో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లలో కూడా ప్రజల పన్నుల డబ్బులతో వచ్చే ఆదాయాన్ని ఖర్చు పెట్టే విషయంలో అలాగే బాధ్యతతో ప్రవర్తించాలి.

ప్రజల అపరిమితమైన ఆకాంక్షలకు పరిమితమైన వనరులకు మధ్యన వారధి కట్టేది రాజకీయం కావాలి. బడ్జెట్ కూడా అంతే. పిండి కొద్ది రొట్టె అంటారు. ఆ పిండితో ఎన్ని రొట్టెలు చేయవచ్చు అన్నే చేయగలుగుతాం. అలాగే మనకు వచ్చే పన్నుల డబ్బులను దేనికి ఖర్చు పెట్టాలో నిర్ణయించుకున్న ప్రాధాన్యతా క్రమం కూడా మంచి బడ్జెట్ అవునా ? కాదా? అని తేలుస్తుంది.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా తాత్కాలిక బడ్జెట్ తో కలుపుకుంటే తొమ్మిదో సారి యూనియన్ బడ్జెట్‌ను సమర్పించారు. ఇది ఒక రికార్డ్. మొదట ఆమెను అభినందించాలి. మన ఇళ్లల్లో కూడా పురుషుల కంటే స్త్రీలే ఇంటి బడ్జెట్ నిర్ణయిస్తారు. అవసరమైన చోట ఖర్చు పెడతారు. అందులో కూడా పొదుపు పాటిస్తారు. మన కుటుంబానికి వచ్చే ఆదాయాన్ని బట్టి ఖర్చులను అంచనా వేస్తూ బడ్జెట్ ఎలా నిర్ణయించుకుంటామో అలాగే పంచాయతీ నుండి దేశం వరకు మనకున్న వనరులను ఆయా రంగాలకు ఖర్చు పెట్టాలి అనే అంశంపై ప్రాధాన్యత క్రమాన్ని బట్టి బడ్జెట్ అంచనాలు తయారు చేసుకుంటాం. అలాగే దేశం కూడా ఒక కుటుంబం అనుకున్నప్పుడు ఇది దేశంలోని మొత్తం జనాభా కుటుంబ బడ్జెట్‌గా అభివర్ణించాలి. ఈసారి 2026-27 ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్లో మంచి చెడులను విశ్లేషించుకునే ప్రయత్నం చేద్దాం.

1991లో ఆర్థిక సంస్కరణల పితామహుడు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు, ఆర్థికమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ హయాం నుండి బడ్జెట్ తీరులో మార్పు వచ్చింది. గత పదేళ్లుగా మరింత మార్పులకు చోటు కల్పిస్తూ సకారాత్మక బడ్జెట్ గా తయారవుతుంది.1991 కంటే ముందు చూసుకుంటే అప్పటి ప్రభుత్వాలు లైసెన్స్ పర్మిట్ రాజ్ ద్వారా ప్రజల జీవితాలను అన్ని రంగాల్లో నియంత్రించేవి, ప్రభావం చూపించేవి. దానివల్ల ప్రజాకర్షక విధానాలు, స్లోగన్లు, అనవసరపు ఆర్భాట ప్రకటనలు ఉండేవి. అలాగే ప్రతి సంవత్సరం బడ్జెట్ ప్రవేశ పెట్టేముందు అనేక ఆశలు రేకెత్తించే పరిస్థితి ఉండేది. తర్వాత ఆశపడ్డ ప్రతివారు దాన్ని విమర్శించేవారు. అలా కాకుండా సంచలనాల బడ్జెట్‌ల నుండి సకారాత్మక బడ్జెట్ల వైపు మెల్లమెల్లగా అడుగులు వేస్తున్నాము.

గతంలో సాధారణ బడ్జెట్, రైల్వే బడ్జెట్ లను వేర్వేరుగా ప్రవేశపెట్టేవారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైల్వే బడ్జెట్ ను ప్రధాన బడ్జెట్ లోనే కలిపి ప్రవేశపెడుతున్నారు. గతంలో ప్రతి సంవత్సరం కొత్త రైల్వే లైన్ల సర్వేలు, ప్రకటనలు ఉండేవి. మనం ఎక్కాల్సిన రైలు జీవితకాలం లేటు అన్నట్లుగా ఆ రైల్వే ప్రాజెక్టులు దశాబ్దాల పాటు నిర్మాణాలు సాగేవి. గత పదేళ్లుగా చూస్తే కొత్త ప్రకటనల కంటే సగంలో ఆగిపోయిన అనేక ప్రాజెక్టులకు బడ్జెట్లో డబ్బులు కేటాయిస్తూ అవి పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కొత్త రైల్వే ప్రాజెక్టులు ప్రకటించే బదులు ఇప్పటికే నిర్మాణం ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయడం అవసరమే కదా. అలాగే 2026-27 బడ్జెట్లో దేశవ్యాప్తంగా మొత్తం ఏడు మార్గాలలో సూపర్ ఫాస్ట్ రైళ్ల ప్రవేశానికి నిర్ణయం తీసుకుంటే అందులో ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలకు మూడు సూపర్ ఫాస్ట్ రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్లో కేటాయింపులతో అంకురార్పణ జరిగింది. హైదరాబాద్-పూణే, హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్- బెంగుళూరుల మధ్య మూడు రైల్వే కారిడార్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రైల్వే లైన్ల ద్వారా తెలంగాణ- రాయలసీమ, తెలంగాణ-కోస్తాంధ్ర ప్రాంతాలకు ప్రజా రవాణా రంగంలో ఒక విప్లవాత్మకమైన మార్పు వస్తుందని చెప్పుకోవచ్చు. దేశంలోని ప్రధాన నగరాలైన ముంబై, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై నగరాల మధ్య మంచి రైల్వే నెట్వర్క్ ఏర్పడే అవకాశం ఉంది.

సాధారణంగా బడ్జెట్ పై రాజకీయ పార్టీల వ్యాఖ్యలు ఎలా ఉంటాయంటే అధికారంలో ఉన్నవారు ఇది అద్భుతమైన

బడ్జెట్ అని అంటే ఇది అంకెల గారడి మాత్రమే అని ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. కాకపోతే పాత్రధారులు మారుతుంటారు కానీ విషయం అదే. అలా చూస్తే మనం బడ్జెట్లో మంచి చెడ్డల్ని బేరీజు వేయలేము. కనుక కేంద్ర బడ్జెట్ లో ఉన్న సకారాత్మక అంశాలను ముందు ప్రస్తావించి ఆ తర్వాత అందులో లోపాలను ప్రస్తావించే ప్రయత్నం చేస్తాను.

ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, భౌతిక యుద్ధాలతో పాటు ఆర్థిక యుద్ధాలు కూడా కొనసాగుతున్నాయి. అలాగే కొన్ని దేశాలలో అంతర్యుద్ధాలు కూడా కొనసాగుతున్నాయి. ఈ దశలో మనదైన రీతిలో మనం రక్షణ రంగానికి ఎక్కువగా నిధులు కేటాయించాల్సిన అవసరం వచ్చింది. జియో పాలిటిక్స్‌లో భాగంగా అమెరికా చైనా లాంటి దేశాల కుట్రల వల్ల మన ఇరుగు పొరుగున ఉన్న దేశాలలో అశాంతి, ఆర్థిక ఉగ్రవాదం పెరుగుతున్న క్రమంలో మనతో ఆ దేశాల సంబంధాలు సరిగ్గా లేవు. అయినా సరే మనం మన ఇరుగు పొరుగు దేశాలకు విదేశీ సాయం కింద ఈ బడ్జెట్ లో నిధులు అందిస్తున్నాం. ఒక్క బంగ్లాదేశ్ కు మాత్రం కొన్ని నిధులు తగ్గించి మిగతా దేశాలకు మరింత అదనంగా నిధులు కేటాయించాము. ఇటువంటి పరిస్థితులలో మనం రక్షణ రంగానికి పెద్దపీట వేయడం ఆశ్చర్యకరం కాదు. అవసరం. అంతకంటే మరొక మార్గం కూడా లేదు. అలాగే ఆర్థిక రంగంలో కూడా ప్రపంచవ్యాప్తంగా అమెరికా సుంకాల మోత వాత చూసుకుంటే మనం అప్పుల భారం తగ్గించుకొని పెట్టుబడును పెంచుకునేలా చేసే బడ్జెట్‌గా దీన్ని చూడవచ్చు. “అప్పు లేని వాడు అధిక శ్రీమంతుడు” అన్న నానుడి ఉంది. కానీ అప్పు చేయకుండా సామాన్య కుటుంబ యజమాని నుంచి మొదలుకొని ప్రభుత్వాల వరకు ఉండలేము. ఒక్కొక్కసారి చే బదులు కూడా తీసుకుంటాం. అప్పు చేసి పప్పు కూడు తింటున్నామా? లేక అభివృద్ధి చేస్తున్నామా? అన్నదాన్ని బట్టి అప్పులను చూడాలి. దేశంలో మనం తీసుకుంటున్న అప్పులకు సరైన న్యాయం చేస్తున్నామనిపిస్తుంది. మౌలిక వసతుల పెంపుపై ప్రణాళిక బద్ధమైన పెట్టుబడులపై పోయినసారి కంటే ఈసారి ఎక్కువ కేటాయింపులు జరిగాయి. దానివల్ల భారతదేశం అభివృద్ధి పథంలో పయనించే అవకాశం ఉంది.

ఇప్పటిదాకా మన జాతీయ ఆదాయంలో వంద రూపాయలు ఆదాయం వస్తే అందులో 60 రూపాయలకు పైగా అప్పు చేస్తున్నాం. గత దశాబ్దంగా దాన్ని మెల్లమెల్లగా 50,55 రూపాయల వరకు తగ్గించగలిగాము. వచ్చే నాలుగైదు ఏళ్లలో ఇది 50% లోపల ఉండేలా చూడగలిగాలి. అధిగమిస్తామని నమ్మకం గత పదేళ్ల బడ్జెట్లను చూస్తే కలుగుతుంది.

ఇక అమెరికా సుంకాల పెంపు వాత నేపథ్యంలో మనదైన రీతిలో యూరోపియన్ యూనియన్ తో సుంకాలు లేని స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం “మదర్ ఆఫ్ ఆల్ డీల్స్” అని అభివర్ణించే అగ్రిమెంట్ కుదుర్చుకోవడం ద్వారా అమెరికాకు వాణిజ్యపరంగా ధీటైన సమాధానం చెప్పగలిగాము. దానికి అమెరికా కూడా లొంగి వచ్చి మనపై సుంకాల మోతలు తగ్గించింది. ఈ రెండు ఒప్పందాలు అమలు కావడానికి మరో సంవత్సరం పడుతుంది. కనుక 2027-28 బడ్జెట్లో ఈ పరిణామాలు మనకు అర్థమవుతాయి. చాలా ప్రపంచ దేశాలు ఆర్థిక అభివృద్ధిలో తమ జీడిపిని కేవలం నాలుగు ఐదు శాతానికి మాత్రమే పరిమితం చేస్తే మనదేశంలో మాత్రం సుమారు ఏడు నుండి 8 శాతానికి పెరగడం మన బడ్జెట్ పై మరింత ఆశ రేకెత్తిస్తోంది.


ఏతా వాత తేలేదేమిటంటే 2026- 27 యూనియన్ బడ్జెట్ “ఉందిలే మంచి కాలం ముందు ముందునా” అనే విధంగా ఆశావహ బడ్జెట్ గా కనిపిస్తుంది. కానీ భారతదేశానికి రెండు సవాళ్లు ప్రధానంగా కనపడుతున్నాయి. మొదటిది ఆర్థిక అసమానతల పెరుగుదల. రెండోది.. సంపద కేంద్రీకరణ. ఈ రెండు పెద్ద ప్రమాదాలు పొంచి ఉన్నాయి. సంపద ఎంత పెంచినా డబ్బు ఉన్నవాడికే డబ్బు చేరి రెక్కల కష్టం మీద ఆధారపడే సామాన్య జనానికి ఒరిగేది ఏమీ లేనప్పుడు సంపద సృష్టిలో భాగమైన వారు తప్పక తిరుగుబాటు చేస్తారు. దీనిని నివారించాలంటే సంపద పునః పంపిణీ జరగాలి. చిల్లర సిగ్గు ఎరగదు అన్నట్లు మొత్తం దేశంలో పన్నులు కట్టే వారు అధికంగా పేద ప్రజలే ఉన్నారు. 65% పన్నులు 50 శాతం దారిద్రరేఖ దిగువన ఉన్నవారే కడుతున్నారు. పేదవారు తమ రోజువారీ సంపాదన సాయంత్రం కల్లా ఖర్చు పెడతారు. దానివల్ల జీఎస్టీ లాంటి పన్నుల రూపంలో ప్రభుత్వాలకు మళ్లీ ఆదాయం చేకూరుతుంది. బాగా సంపాదించిన వాడు డబ్బులు వెనకేసుకుంటాడు కానీ అధికంగా ఖర్చు చేయడు. దానివల్ల ప్రభుత్వాలకు వచ్చే పన్ను నామ మాత్రమే. అందుకే దేశవ్యాప్తంగా సంపద పన్ను , వారసత్వ పన్ను వెయ్యాలనే డిమాండ్ వస్తుంది. మన ఓటు ద్వారా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి మన పన్నుల డబ్బుల ద్వారా ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఈ సంగతి ప్రభుత్వాలు గమనించినప్పుడు ఆ సంపద ఎవరికి పంచాలి అనేది ఆలోచించాలి. అప్పుడే బడ్జెట్ లకు ఒక అర్థవంతమైన పరిష్కారం దొరుకుతుంది.

-బండారు రామ్మోహనరావు

# మారథాన్ బడ్జెట్ -యూబీ 2026-27పై జేపీ-

బడ్జెట్ అంటే అద్భుతాలు జరుగుతాయని, చాలా మార్పులు వస్తాయని, అనూహ్యమైన పరిణామాలు సంభవిస్తాయని అనుకోనక్కర్లేదని, అది ఆదాయవ్యయాల్లో నిలకడను తెలియచేసే అవకాశమని.. ఆ రకంగా చూస్తే యూనియన్ ప్రభుత్వ తాజా వార్షిక బడ్జెట్ సరైన దారిలో నడుస్తోందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఆర్థిక మంత్రి లోక్ సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026-27పై యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో జేపీ స్పందించారు. ముఖ్యాంశాలు:



'ఆదివారమైనా ఫిబ్రవరి 1న యథావిధిగా జాతీయ స్థాయి బడ్జెట్ను ప్రవేశపెట్టటం ముందుగా అభినందించాల్సిన విషయం. ప్రభుత్వానికి ఎంత ఆదాయమొస్తోంది, ఎంత ఖర్చు చేస్తోందీ రోజూ ఇష్టమొచ్చినట్లు మార్చకుండా గందరగోళం చేయకుండా ఉండటానికి సరైన బడ్జెట్ సంకేతం. బడ్జెట్ పెద్దగా సంభ్రమాశ్చర్యాలకు లోనుచేయకుండా ఉందీ అంటే .. అది సరైన బడ్జెట్ కింద లెక్క. ఒకప్పుడు లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యంలో ఉన్నాం కాబట్టి, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసింది కాబట్టి .. దాన్ని బాగుచేసే క్రమంలో 1991 నుండి కొన్ని సంవత్సరాల పాటు మనం బడ్జెట్‌ని ఉత్కంఠగా చూసేవాళ్లం. కానీ ఇప్పుడు నిలకడతనం చూసుకుంటే చాలు. గత కొద్ది సంవత్సరాలుగా బడ్జెట్ సరైన దారిలో నడుస్తోంది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపరితనం పాటిస్తున్నారు. డబ్బుని సద్వినియోగం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం, అభివృద్ధి కోసం వినియోగిస్తున్నారు. ఆ ఒరవడిని తాజా బడ్జెట్ కొనసాగించింది.

ఈవేళ గతంతో పోలిస్తే చాలా ప్రతికూల పరిస్థితులున్నాయి. ఉదాహరణకు, అమెరికా మన మీద సుంకాలు విధించటం కావచ్చు, ప్రపంచంలో చాలాచోట్ల గందరగోళం చోటుచేసుకోవటం కావచ్చు, ఉక్రెయిన్ లాంటి చోట యుద్ధం వల్ల సరఫరా గొలుసుల్లో అవాంతరాలు కావచ్చు.. వివిధ కారణాల వల్ల ప్రపంచమంతా కొంత ఆందోళనకు లోనవుతున్నది. ఈ నేపథ్యంలో కూడా 7% అభివృద్ధిని నిలకడగా సాధిస్తున్న దేశం భారత్. అది కూడా ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ.

కొవిడ్ కాలంలో మన ద్రవ్యలోటు 9.2%కి వెళ్లింది. ఆదాయం కంటే ఆ మేరకు ఖర్చు ఎక్కువైంది. అదనంగా అప్పులు. వెరసి చాలా పెద్ద మొత్తం. దాన్ని గత అయిదేళ్లుగా జాగ్రత్తగా క్రమశిక్షణను పాటిస్తూ 4.4%కి తీసుకువచ్చారు ఈ సంవత్సరం. ఏదైతే ప్రతిపాదించారో దాన్ని ఆచరణలో చూపారు. వచ్చే ఏడాదికి మరో 0.1% తగ్గిస్తామన్నారు. ఇది చాలా గణనీయ అభివృద్ధి.

అదేవిధంగా, జాతీయాదాయంలో అప్పుల శాతం 100కి రూ.61 దాకా ఉండేది. ఇప్పుడది 55-56కి వచ్చింది. క్రమక్రమంగా వచ్చే నాలుగైదేళ్లలో రూ.50లోపుకి పడిపోయేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు ప్రభుత్వాన్ని మనసారా అభినందించాలి. ఒక పేద దేశంలో, ఇన్ని కష్టాలున్న పరిస్థితుల్లో.. అటు ప్రజల ఆశలు నెరవేరుస్తూ, ఇటు ఆర్థిక క్రమశిక్షణ పాటించి అప్పుల భారం తగ్గించటం చాలా గణనీయం విజయం. రెండోది, ఇదే సమయంలో పెట్టుబడుల్ని విపరీతంగా పెంచుతున్నారు.

**మౌలిక సదుపాయాలకు భారీ పెట్టుబడులు**

గత నాలుగైదేళ్లుగా చూసినట్లయితే, చరిత్రలో మన దేశంలో ఏనాడూ లేనిరీతిలో ప్రభుత్వం పెట్టుబడులు పెడుతోంది. నడుస్తున్న సంవత్సరంలో 11.20 లక్షల కోట్లు మౌలిక సదుపాయాలకు ఖర్చు చేయగా, వచ్చే

ఏడాదికి అది రూ.12.20 లక్షల కోట్లు. రాష్ట్రాలకు మౌలిక సదుపాయాలకిచ్చే డబ్బు, ఇతర పెట్టుబడులు కూడా కలుపుకుంటే, అది బహుశా 17 లక్షల కోట్లు. ఇది గణనీయ ప్రగతి. రైల్వేలు, జాతీయ రహదారులు, పోర్టులు కావచ్చు, ఇతర ఏర్పాట్లు కావచ్చు .. గణనీయ మూలధన వ్యయం జరుగుతోంది. దాంతోపాటు, ఈసారి బడ్జెట్‌ను లోతుగా చూసినట్లయితే.. అటు వస్తువుల ఉత్పత్తి, ఇటు సేవల ఉత్పత్తి. వస్తువుల ఉత్పత్తిలో కూడా గతంలో చైనా తయారుచేసినవి కాకుండా ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో విలువ కలవి, సాంకేతిక విజ్ఞానానికి పనికొచ్చేవి. అధిక విలువ గల ఉత్పత్తిని పెంచటం, ఎగుమతుల్ని పెంచటం లక్ష్యంగా ప్రతిపాదించారు. అదేవిధంగా సేవల రంగంలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. సేవల ప్రమాణాలను, విస్తృతిని పెంచి ప్రపంచంలో 2047 నాటికి సేవల ఉత్పత్తి ప్రపంచంలో 10% లక్ష్యంగా ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు.

**కీలక రంగాల్లో నిపుణుల కమిటీలు**

ఇక మూడోది, చిన్న పట్టణాల అభివృద్ధి మీద దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. అదేవిధంగా చిన్న పరిశ్రమలు, పెద్ద పెట్టుబడులు అవసరంలేనివి, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించేవి.. వీటి మీద ప్రకటనలు చేశారు. సేవా రంగంలో నైపుణ్యాల్ని పెంచి మన స్థాయిని ఉన్నతీకరించటం కోసం శాశ్వత

**మూడు లక్ష్యాలు.. రూ.53,47,315 కోట్లు**

అభివృద్ధికి ఊతమివ్వటం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చటం, ప్రగతి పథంలో అందరినీ కలుపుకొని వెళ్లటం.. ప్రధాన లక్ష్యాలతో రూ.53,47,315 కోట్ల బడ్జెట్. ఇందులో రెవెన్యూ వసూళ్లు రూ.35,33,150 కోట్లు కాగా, రెవెన్యూ వ్యయం 41,25,494 కోట్లు. పెట్టుబడుల వ్యయం అంతా కలిపితే రూ.17 లక్షల కోట్లకి పైగా.

ప్రాతిపదికన ఒక ఉన్నతస్థాయి బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం నిరంతర పర్యవేక్షణ చేస్తుంది. అదేవిధంగా, ఆర్థిక రంగంలో బ్యాంకులు మరింత సమర్థంగా సేవలందించటానికి, గత 10 ఏళ్లుగా చాలా తీవ్ర ప్రయత్నం జరిగి ఖాయిలా పడ్డ బ్యాంకుల్ని



ఆరోగ్యకరమైన స్థితికి తీసుకొచ్చారు. మొండి బకాయిలు అప్పుడు 100 కి రూ.12 దాకా ఉండేవి. ఇప్పుడు రూ.2కి దించారు. మరింత బాగుచేయటానికి, భవిష్యత్తులో బ్యాంకింగ్ రంగాన్ని సమర్థవంతం చేయటానికి ఒక అగ్రస్థాయి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరో సంతోషించదగ్గ అంశం.. పన్నుల విషయంలో ఇప్పటికీ పెట్టుబడిదారులకు చికాకులు కలిగిస్తున్నారు. పెట్టుబడి పాపం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. సులభతర వాణిజ్యానికి చాలామేర అడ్డుతొలగించటం, చిన్న సమస్యలను పెద్ద నేరాలుగా చిత్రించకుండా జరిమానాలు వంటివి విధించటం వంటి అంశాలపై శ్రద్ధ చూపారు. అదేవిధంగా, కోర్టులకి వెళ్లాల్సిన, లిటిగేషన్ల సమస్యలేకుండా పరిష్కారాలకు ఏర్పాట్లు చేశారు. ఆర్థిక మంత్రి ఈ అంశాలన్నటినీ వివరంగా ప్రస్తావించారు. చార్టర్డ్ అకౌంటెంట్లు వంటి వారు లోతుకెళ్తే మరిన్ని విషయాలు వెల్లడయ్యే అవకాశముంది.

**తెలుగువారికి 3 హైస్పీడ్ రైళ్లు**

మన తెలుగువారు మరింత సంతోషించాలి. ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించగా, అందులో మూడు తెలుగు ప్రాంతాలకు అవకాశమిచ్చారు. హైదరాబాద్– పూణె , హైదరాబాద్ నుండి బెంగళూరు, హైదరాబాద్ నుండి చెన్నై. ఇవి ఆంధ్రప్రదేశ్‌కి కూడా ప్రయోజనకరం. 16వ ఆర్థిక సంఘం నివేదికను

## ఇదీ బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెలు రూ.కోట్లలో)

| అంశం | 2024-25 వాస్తవ గణాంకాలు | 2025-2026 బడ్జెట్ అంచనాలు | 2025-2026 వాస్తవ (ప్రాథమిక) గణాంకాలు | 2026-2027 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు | 30,36,619 | 34,20,409 | 33,42,323 | 35,33,150 |
| • పన్ను ఆదాయం | 25,00,039 | 28,37,409 | 26,74,661 | 28,66,922 |
| • పన్నేతర ఆదాయం | 5,36,580 | 5,83,000 | 6,67,662 | 6,66,228 |
| 2. మూలధన వసూళ్లు | 16,16,248 | 16,44,936 | 16,22,519 | 18,14,165 |
| • రుణాల రికవరీ | 24,617 | 29,000 | 30,190 | 38,397 |
| • ఇతర వసూళ్లు | 17,202 | 47,000 | 33,837 | 80,000 |
| • రుణాలు | 15,74,431 | 15,68,936 | 15,58,492 | 16,95,768 |
| మొత్తం ఆదాయం (1+2) | 46,52,867 | 50,65,345 | 49,64,842 | 53,47,315 |
| మొత్తం వ్యయం (3+6) | 46,52,867 | 50,65,345 | 49,64,842 | 53,47,315 |
| 3. రెవెన్యూ పద్దు | 36,00,914 | 39,44,255 | 38,69,087 | 41,25,494 |
| 4. వడ్డీ చెల్లింపులు | 11,15,575 | 12,76,338 | 12,74,338 | 14,03,972 |
| 5. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు | 2,72,656 | 4,27,192 | 3,08,151 | 4,92,702 |
| 6. మూలధన పద్దు | 10,51,953 | 11,21,090 | 10,95,755 | 12,21,821 |
| • నికర మూలధన వ్యయం (5+6) | 13,24,609 | 15,48,282 | 14,03,906 | 17,14,523 |
| 7. రెవెన్యూ లోటు (3-1) | 5,64,296 | 5,23,846 | 5,26,764 | 5,92,344 |
| 8. నికర రెవెన్యూ లోటు (7-5) | 2,91,640 | 96,654 | 2,18,613 | 99,642 |
| 9. ద్రవ్య లోటు | 15,74,431 | 15,68,936 | 15,58,492 | 16,95,768 |
| 10. ప్రాథమిక లోటు | 4,58,856 | 2,92,598 | 2,84,154 | 2,91,796 |

ఆమోదించారు. గతంలోలాగానే 41% నిధుల్ని రాష్ట్రాలకు బదిలీ చేస్తారు. ఇంతేకాకుండా, పెట్టుబడుల కోసం ఇచ్చే వడ్డీలేని రుణాలు. మొత్తం కలిపితే 54% దాకా మొత్తం జాతీయస్థాయి ఆదాయంలో రాష్ట్రాలకు పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా కొద్దిపాటి మార్పులు చేర్పులు వచ్చాయి. తెలుగు రాష్ట్రాలు సహా దక్షిణాదికి వెయిటేజీని పెంచారు. మాకు ఆదాయం ఎక్కువ వస్తోంది, పన్నులు ఎక్కువ కడుతున్నాం, కానీ పన్నుల డబ్బు పంపిణీలో మాత్రం తక్కువ ఇస్తున్నారు అని ఇటీవల ఆందోళనల చేయటంతో స్వల్ప మార్పులు చేశారు. దక్షిణాది, పశ్చిమ ప్రాంత రాష్ట్రాలకు కొంత పెరగ్గా, ఆ మేరకు ఉత్తరాదిన పెద్ద రాష్ట్రాలకు ఆర్థిక సంఘం నుండి వచ్చే నిధులు కొంచెం తగ్గుతాయి. ఇదేసమయంలో స్థానిక ప్రభుత్వాలకు వచ్చే ఏడాది రూ. 1,01,002 కోట్లు మంజూరు చేశారు. ఈ సంవత్సరం 80వేల కోట్ల కంటే ఇది 25% పెంపు. అంటే, స్థానిక ప్రభుత్వాలకి ఆర్థిక సంఘం నిధులిచ్చే గత సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

**మరి సమస్యలేంటి?**

రెండు ప్రధానంగా కనిపిస్తాయి. మొట్టమొదటిది, ప్రభుత్వరంగ సంస్థల్లో 70 లక్షల కోట్ల ప్రజాధనం పడివుంది. అది ఈ దేశ ప్రజల డబ్బు. ప్రభుత్వ రంగంలో ఆ మొత్తం కొనసాగటం వల్ల వ్యాపారాభివృద్ధి కొనసాగుతోంది. మనకేమో వాణిజ్యాభివృద్ధికి బయటి నుండి అప్పులు పెరుగుతున్నాయి. మన వనరుల్నే వినియోగించుకునేలా ఆ ఆస్తుల్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రయివేటు రంగం వల్ల పోటీ ఏర్పడు తుంది. దీనివల్ల విలువ పెరుగుతుంది. ఉపాధి, ఆర్థిక వ్యవస్థ పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధి మరింత సాధ్య మవుతుంది. ప్రభుత్వం సంక్షేమాన్ని ఇంకా పెంచవచ్చు,

పెట్టుబడులకీ ఎక్కువ వెచ్చించవచ్చు. అప్పులు తగ్గించవచ్చు. కానీ దానికి బడ్జెట్‌లో ఏర్పాట్లు జరిగినట్లు కనిపించటం లేదు.


**ఉపాధికి కీలకమైన చిన్న పట్టణాల గురించి మాటలు తప్ప సమగ్ర వ్యూహం లేదు**


రెండోది.. తృతీయ, ద్వితీయ స్థాయి నగరాల ప్రస్తావన వచ్చిందిగానీ.. తక్కువ నైపుణ్యం, తక్కువ ఆదాయాలు, రెక్కాడితేగానీ డొక్కాడని వారికి ఉపాధిని కల్పించటం ప్రధాన లక్ష్యంగా పెద్ద వ్యూహం కనిపించటం లేదు. ఈ దేశంలో అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే, అసంఘటిత రంగంలో నిరుపేదలు, రోజువారీ సంపాదనాపరులకి నిలకడైన ఆదాయం, ఉపాధి కల్పన అవకాశం కల్పించాలి. సంఘటిత రంగంలోని జీవన భద్రతకు ఏర్పాట్లు చేయాలి. అంటే, చిన్న చిన్న పట్టణాల్లో మనకున్న సదుపాయాల్ని మెరుగుపరచి, అక్కడ ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకుని ఉపాధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి.


**అసలు సమస్య ఉన్నది రాష్ట్రాల్లో**

ఇక జాతీయస్థాయిలో ఎన్ని ప్రయత్నాలు చేసినా, సమస్య ఉన్నది అక్కడ కాదు రాష్ట్రాల్లో. ప్రతి రాష్ట్రం ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. పెట్టుబడుల కోసం డబ్బులు కేటాయించాలి. అవినీతి లేకుండా వాటిని సద్వినియోగం చేయాలి. తాత్కాలిక సంక్షేమం కాకుండా, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం బాటలు వేయాలి. చట్టబద్ధపాలన అమలు చేసి, మన పెట్టుబడులకు, ఆస్తులకు రక్షణ కల్పించాలి. కష్టపడితే లాభాలొస్తాయన్న నమ్మకం కలిగించాలి.

ఇవన్నీ రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర స్థాయిలోని అంశాలు. ఈవేళ రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకి పూర్తి భరోసా ఇవ్వాలి. ఎందుకంటే, రాష్ట ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర ప్రభుత్వాలు, ముఖ్యమంత్రుల చేతుల్లో ఉంది.ఢిల్లీ చేతుల్లో లేదు. జాతీయ స్థాయిలో విధానాలు, బడ్జెట్‌లు అవసరమే. కానీ రాష్ట్రాల్లో బడ్జెట్లు, రాష్ట్రాల్లో విధానాలు, మంచి పరిపాలన మరింత అవసరం. ఆర్థికాభివృద్ధి జరగాలన్నా, పేదరికం పోవాలన్నా, ఉపాధి అవకాశాలు లభించాలన్నా, పెట్టుబడులు పెరగాలన్నా.. ఈ ప్రయత్నం జరగాలి. ఇందుకు చిత్తశుద్ధితో రాష్ట్రాలూ కృషి చేస్తాయని ఆశిస్తున్నా' ✦




## బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం ఉప ముఖ్యమంత్రి భట్టి

కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని, ముఖ్యమైన ప్రాజెక్టులకు కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశను కలిగించిందని ఉపముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్క విమర్శించారు. కేంద్రానికి అనేక విజ్ఞప్తులు చేసిన పట్టించు కోలేదని ఆరోపించారు. రైజింగ్ తెలంగాణ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుంటే కేంద్రం నుంచి ప్రోత్సాహం లభించలేదన్నారు.

# వెనిజువెలా అనుభవం నుండి భారత్ నేర్చుకోవాల్సిన పాఠాలు

-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



వెనిజువెలాలో అమెరికా సైనిక జోక్యం అసాధారణం. పదవిలో ఉన్న అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను బందీలుగా అమెరికాకు తీసుకెళ్లారు. ఒక సార్వభౌమదేశ అధికార నివాసం నుండి అధ్యక్షుడ్ని ఓ సూపర్ పవర్ దేశం బందీగా తీసుకెళ్లటం, ఐక్యరాజ్యసమితి నియమావళిని, అంతర్జాతీయ చట్టాన్ని ఎడాపెడా ఉల్లంఘించటం గురించి చాలా జనమాధ్యమాల్లో రాశారు, మాట్లాడారు. వెనిజువెలా పరిణామాలు అన్ని దేశాలకూ ఓ పాఠం. వచ్చే పాతికేళ్లలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఉమ్మడి దార్శనికతను కలగంటున్న భారత్ కి ఈ పాఠాలు మరింత కీలకం.

ముందుగా సైనిక జోక్యం గురించి. ఎత్తుగడగా అదో గొప్ప విజయం. వేగుల విశ్వసనీయ సమాచారం, మూడో కంటికి తెలియని ప్రణాళిక, ఏమాత్రం పొరపాటుకు ఆస్కారమివ్వని అమలు.. అమెరికా అపూర్వ సాయుధ పాటవానికి అద్దం పడుతుంది. కానీ ఈ విజయం అర్థవంతమైన, నిర్మాణాత్మక ప్రయోజనాల్ని అందిస్తుందా? వాగాడంబరాల ట్రంప్, అమెరికా అధికార యంత్రాంగం ప్రకటనలను నిశితంగా పరిశీలిస్తే, మనకు మూడు వ్యూహాత్మక లక్ష్యాలు కనిపిస్తాయి. మొదటిది, అమెరికా ప్రజల్నివ్యసనానికి బానిసల్ని చేసే మాదకద్రవ్యాలు దేశంలోకి పెద్దఎత్తున వచ్చిపడకుండా కట్టడి చేయటం.

అయితే.. ఏ రకంగా చూసినా, అమెరికాకి డ్రగ్స్ సరఫరాలో మదురో సూత్రధారి కాదు. ఒక అసాధారణ సైనిక చర్యను సమర్థించుకోవటానికి అమెరికా చెప్పిన కుంటి సాకు మాత్రమే ఇది. వంక కోసం అలవోకగా అల్లిన అతిశయోక్తి.

మదురోను తొలగించటం వల్ల మాదక ద్రవ్యాల సరఫరా మూలాల్ని పెకలించే అవకాశం లేదు. డిమాండ్‌ను నిలువరించకుండా, కేవటం చట్టాన్ని కఠినంగా అమలు చేయటం.. డ్రగ్స్ వాడకాన్ని ఇంకా పెంచుతుంది. ధరలు, లాభాలు అనూహ్యంగా పెరుగుతూ సంఘటిత నేరముఠాల్ని ఈ దందాలోకి మరింతగా ఆకర్షిస్తుంది. పలు నివేదికలు, అనుభవాలు వెల్లడిస్తున్న కఠిన వాస్తవాలివి. చివరికి ఈ పరిస్థితుల్ని అడ్డం పెట్టుకుని పాలనా యంత్రాంగంలో అన్ని స్థాయిలో అవినీతి వేళ్లూనుకుంటుంది. కొండ నాలుక్కి మందు వేయబోతే, ఉన్న నాలుక ఊడుతుందన్న చందంగా పరిస్థితి తయారవుతుంది.

ట్రంప్ చెప్పిన రెండో లక్ష్యం..చమురు ఉత్పత్తిని పెంచటం, సరఫరాని విస్తరించటం; అమెరికా చమురు కార్పొరేషన్లకి వెనిజువెలాలోని క్షేత్రాలని, యుద్ధ విజేతగా చేజిక్కించుకునే వనరుల్ని చవగ్గా అందుబాటులోకి తేవటం. కానీ ఈ అంచనాలో అమెరికా పప్పులో కాలేసిందనుకోవాలి.

ప్రపంచవ్యాప్త సగటును చూస్తే చమురు డిమాండ్ హెచ్చుతగ్గుల్లేకుండా స్థిరీకరణకు చేరుకుంది. దీర్ఘకాలంలో ఇంకా పడిపోతుంది. వచ్చే రెండు దశాబ్దాల్లో భారీ

**అమెరికా ఖండాల్లో (ఉత్తర, దక్షిణ) అమెరికాను ఎవరూ సవాలు చేయకుండా ఏకఛత్రా ధిపత్యాన్ని పాదుకొల్పాలని కోరుకుం టున్నారు. కానీ అధికారంలో ఉన్న ఒక దేశా ధ్యక్షుడ్ని బలప్రయోగంతో బందీగా చేసి తరలిం చటం వికటించే అవకాశం ఉంది. అది, ఇతర దేశాల్లో అమెరికా పట్ల భయాన్ని ఇంకా పెంచు తుంది. అమెరికా జోక్యం పట్ల వ్యతిరేకత పెరుగు తుంది తప్ప, పలుకు బడి పెరగదు. స్వేచ్ఛను పెంచి, అభివృద్ధికి దోహదం చేసే మార్గసూచీ లేకుండా అధికారాన్ని అంత అనాగరికంగా, అప్రజాస్వామికంగా ప్రదర్శించే ధోరణి చివరికి అమెరికా పలుకుబడి క్షీణతకు దారితీస్తుంది.**

పెరుగుదల సౌర, పవన విద్యుత్, జీవ ఇంధన విభాగాల్లో నమోదుకానుంది. చమురు కూటముల జమానా ముగిసినట్లే.అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థను గత్యంతరంలేని స్థితిలోకి నెట్టి అసాధారణ లాభాల్ని ఆర్జించే శకానికి తెర పడినట్లే.సరఫరా గొలుసులకు తాత్కాలిక విఘాతం (యుద్ధాలు, సముద్ర రవాణాలో అవాంతరాలు, ఉగ్రవాద దాడులు మొదలైన సందర్భాలలో) ఏర్పడిన సందర్భాల్లో మాత్రమే ధరలు పెరిగే అవకాశముంది. అంతకు మించి రానున్న దశాబ్దాల్లో పెద్ద మార్పులేవీ ఆ రంగంలో రావు. క్రమంగా, ప్రపంచ ఇంధన అవసరాల్లో అత్యధికం పునరుత్పాదక ఇంధనాల ద్వారా భర్తీ అవుతాయి.

ఇంధన రంగంలో సాంకేతికత రాజకీయాల కంటే ఎంతో ముందుంది. దీనికితోడు, వెనిజువెలా చమురు చాలా భారమైనది. వెలికితీసి, శుద్ధి చేయటం ఖరీదైన ప్రక్రియ. అందులోనూ ఇతరత్రా అవకాశాలు లాభాలపరంగా మరింత ఆకర్షణీయంగా ఉన్నప్పుడు.కొద్దిపాటి లాభాల కోసం పెద్ద చమురు సంస్థలు భారీ వనరుల్ని ఇందులో వెచ్చించే అవకాశాలు తక్కువ.

ట్రంప్ మూడో ప్రధాన లక్ష్యం..అమెరికా ఆధిపత్యాన్ని సైనిక, ఆర్థిక భారం లేకుండా ప్రపంచానికి ప్రదర్శించటం. ఈ విషయంలో ట్రంప్ ప్రత్యేకించి మన్రో సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నారు. అమెరికా ఖండాల్లో (ఉత్తర, దక్షిణ) అమెరికాను ఎవరూ సవాలు చేయకుండా ఏకఛత్రాధిపత్యాన్ని పాదుకొల్పాలని కోరుకుంటున్నారు. కానీ అధికారంలో ఉన్న ఒక దేశాధ్యక్షుడ్ని బలప్రయోగంతో బందీగా చేసి తరలించటం వికటించే అవకాశం ఉంది. అది, ఇతర దేశాల్లో అమెరికా పట్ల



భయాన్ని ఇంకా పెంచుతుంది. అమెరికా జోక్యం పట్ల వ్యతిరేకత పెరుగుతుంది తప్ప, పలుకుబడి పెరగదు. స్వేచ్ఛను పెంచి, అభివృద్ధికి దోహదం చేసే మార్గసూచీ లేకుండా అధికారాన్ని అంత అనాగరికంగా, అప్రజాస్వామికంగా ప్రదర్శించే ధోరణి చివరికి అమెరికా పలుకుబడి క్షీణతకు దారితీస్తుంది. భయం అంటే గౌరవం కాదు! ఆమోదం, పరస్పర ప్రయోజనం లేకుండా భయపెట్టిలాభార్జన తాత్కాలికమే అవుతుంది. వెనిజువెలాలో అమెరికా బలప్రయోగం గెలిచినా.. చివరికి గెలుపోటముల మధ్య తేడాలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీర్ఘకాలంలో వ్యూహాత్మక తప్పిదమవుతుంది.

మనం, భారతలో, వెనిజువెలా అనుభవం నుండి నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. ఉత్పాదకతను, ఆర్థిక వ్యవస్థను పెంచకుండా.. సంక్షేమం పేరుతో తాత్కాలిక వ్యక్తిగత పథకాల్ని అమలు చేస్తే వైఫల్యం అనివార్యమన్నది పెద్ద పాఠం. వెనిజువెలాలో భారీ చమురు నిల్వల గురించి ప్రపంచ దేశాలన్నిటికీ నిర్ధారణగా తెలుసు. అయినా, వెనిజువెలా దశాబ్దాలుగా ఘోరంగా విఫలమైంది. భూమాత నుండి తగినంత చమురును వెలికితీస్తూ, అంతర్జాతీయ చమురు ధరలు ఎక్కువగా ఉన్నంత వరకూ, అంతా బాగానే నడుస్తుంది. ఒకానొక సమయంలో, వెనిజువెలా జీడీపీలో 14% దాకా కేవలం సంక్షేమంపై ఖర్చు చేశారు. మౌలిక వసతుల్ని నిర్లక్ష్యం చేశారు. ధరల నియంత్రణ వల్ల మార్కెట్ ఛిన్నాభిన్నమైంది. ఉత్పత్తిదారులైన రైతులు, పారిశ్రామిక కార్మికులు భారీగా నష్టపోయారు. చాలా చోట్ల ఉత్పత్తి స్తంభించింది. ఇష్టమొచ్చినట్లు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయటం వల్ల దిగుమతులు మాత్రమే పెరిగాయి. చెల్లింపులతో ఖజానా ఖాళీ అయింది. ఎప్పుడైతే ఉత్పత్తి పెరగటానికి ప్రోత్సాహం కరువైందో.. నిత్యావసరాలైన ఆహారం, ఔషధాలు కూడా దిగుమతుల జాబితాలోకి చేరిపోయాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతం విశృంఖలమయ్యాయి. ఇదే




సమయంలో చావెజ్ మరో భారీ సెల్ఫ్ గోల్ దుస్సాహసానికి పాల్పడ్డారు. చమురు కంపెనీలను జాతీయం చేశారు. సమర్ధులైన వృత్తినిపుణుల్ని ఉద్యోగాల నుండి మూకుమ్మడిగా ఊడబెరికారు. ఫలితంగా, ఉత్పత్తి ఒక్కసారిగా పతనమైంది. చమురు ధరలు పడి పోగానే, ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనం బైటపడి ముక్క చెక్కలైంది. సమాజం శిథిల గాథల ఆర్తనాదంగా మారింది. దేశం మండకుండా నియంత్రించటానికి క్రూర బల ప్రయోగమే మార్గమైంది. దోచుకోవటంలో సైనిక బలగాలు తోడుదొంగలయ్యాయి. అపార చమురు సంపద గల ఒక దేశహెచ్చరిక గాథ ఇది.

భారత్‌కి అలాంటి చమురు నిల్వలు కూడా లేవు. ఇంధన వాడకంలో మాత్రం చైనా తరువాత అగ్రస్థానం అవుతున్నాం. మన ఖజానా డబ్బులో భారీ వాటాను చమురు కొనుగోళ్లే కొల్లగొడు తున్నాయి (కాస్త చవగ్గా వస్తోందని రష్యా నుంచి చమురు కొనుగోలు చేయటమే గదా అమెరికాకు మన మీద సుంకాలు విధించటానికి వంకగా మారింది). అయినా రేపు అనేదే లేనట్లు, కొన్ని రాష్ట్రాలలో ఇష్టమొచ్చినట్లు ఖజానా సొమ్మును దుబారా చేస్తున్నాం, సంక్షేమం పేరుతో వ్యక్తిగత తాత్కాలిక పథకాలను అప్పులు తెచ్చి మరీ అమలు చేస్తున్నాం. వెనిజువెలా విషాదం చూశాక, మన దేశానికి పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించటానికి మేధావులు కానక్కర్లేదు, ఇంగిత జ్ఞానం కాస్త సవ్యంగా పనిచేస్తే చాలు.

గిగ్ ఆర్థిక వ్యవస్థపై ఇటీవల జరుగుతున్న చర్చ మన దేశం ముందున్న సవాళ్లను సోదాహరణంగా తెలియ చేస్తోంది. ఇప్పటికీ మన కార్మికుల్లో 85% మంది అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరికి నైపుణ్యాలు, ఆదాయాలు తక్కువ. ఉద్యోగ భద్రత లేదు. కానీ మిగతావారిలా వీరికీ రోజువారీ జీవితాలుంటాయి గదా. పనిచేసేవారిలో దాదాపు 46% మంది ఇప్పటికీ వ్యవసాయరంగంలో ఉన్నారు. కానీ ఇంతమంది ఆధారపడిన ఈ రంగం ఆదాయం జీడీపీలో కేవలం 16-18%. ఈ నేపథ్యంలో.. మన కార్మికులకు ఎక్కువ ఉత్పాదక ఉద్యోగాలను సృష్టించటం, అందరికీ జీవన భద్రత, గౌరవం, అవకాశాల్ని అందించటం మన ముందున్న అతి పెద్ద సవాలు! ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించ టానికి మనం దేశంలో పనిచేసేవారందరికీ ఒక ఆచరణ సాధ్య, పటిష్ఠ సామాజిక భద్రతా వ్యవస్థను నిర్మించాలి.

మార్కెట్‌తో పోలిస్తే కేవలం 3% ఉన్న మన ప్రభుత్వోద్యోగులు అనేక రెట్లు ఎక్కువ జీతభత్యాలు పొందు తున్నారు. పనిచేసినా చేయకున్నా, జవాబుదారీతనం లేకున్నా, అందినంత లంచాల్ని మింగుతున్నా వారి జీవితానికేమీ ఢోకా ఉండదు. ప్రభుత్వోద్యోగులకు మాత్రమే భద్రత కల్పిస్తే చాలదు. మిగతా 97% మంది ప్రజానీకానికీ ఆత్మగౌరవంతో కూడిన ఆర్థిక భద్రతను అందించాలి. ప్రజల గోళ్లూడ గొట్టి వారి కష్టార్జితాన్ని పన్నుల రూపంలో వసూలు చేసే అధికారం ప్రభుత్వానికి దఖలు పడి ఉంది. కానీ అందుకు తగ్గ సేవల్ని మాత్రం అందించదు. అధికారాన్ని ప్రభుత్వోద్యోగులతో కలసి చెలాయిస్తుంది. అధికారుల పట్ల ఆశ్రిత పక్షపాతంతో వ్యవహరిస్తుంది. చాలా సందర్భాల్లో రాజకీయం, పాలనా యంత్రాంగం లాలూచీ పడుతుంటాయి. మార్కెట్‌లో పనిచేసేవారు మాత్రం పోటీ, ఆర్థిక సామర్థ్యం, ఉత్పాదకత సూత్రాలను పాటించాల్సి ఉంటుంది. లేకుంటే, దివాళా తీయటం, ప్రభుత్వం ముందు చేయిజాచి పథకాలను అర్థించాల్సి ఉంటుంది. ఇది రాజ్యాంగ పాలన కాదు. కాబట్టి, ప్రభుత్వం తన పని తాను చేయాలి. అంటే.. ఉత్పాదకతను, అవకాశాలను అందించటానికి ఆవశ్యకమైన సేవలను (విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి ఉమ్మడి సేవలు) సక్రమంగా అందించాలి. అంతేతప్ప, ప్రజల కష్టార్జితాన్ని తన సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు దుబారా చేస్తూ, ప్రజల విజయాల్ని తన ఘనత అన్నట్లు ప్రచారం చేసుకోవటం, వాస్తవంలో మాత్రం వారి జీవితా లకు ఎటువంటి విలువనూ జోడించకపోవటం, సర్వాంత ర్యామిలా వ్యవహరించటం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం.

# 17 ఎ, 8 సవరణల్ని ఇప్పటికైనా రద్దు చేయండి..

## అవినీతి, నల్లధనం అంతానికి నిర్దిష్ట సంస్థాగత చర్యల్ని ప్రారంభించండి

యూనియన్‌లోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విధానపరంగా చేసిన పెద్ద తప్పిదాల్లో అవినీతి నిరోధక చట్టం.. 1988కి 2018లో చేసిన సవరణ ఒకటి. ఇందులో 'సెక్షన్ 17 ఎ'ని ప్రభుత్వం చేర్చింది. అవినీతిని నిరోధించటంకాక.. అవినీతిపై పోరాటాన్ని ఇది నీరుగార్చే చర్యని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అప్పడే ప్రభుత్వానికి, పార్లమెంటు సభ్యులుకు, వివిధ ప్రధాన పార్టీలకు లేఖలు, సంబంధిత సమాచారం సహా పంపించారు. వివిధ సమావేశాలు, మీడియా ఇంటర్వ్యూల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేశారు. కానీ విచిత్రంగా, కాంగ్రెస్‌తో పాటు ప్రజాఉద్యమాలకు పెట్టింది పేరని చాటుకునే కమ్యూనిస్టు పార్టీలు సహా అందరూ ఆ బిల్లును సమర్థించి ఆమోదించారు. మీడియా డూడూ బసవన్న పాత్ర పోషించింది. ఈ సవరణ ప్రకారం.. అవినీతి ఆరోపణలు వచ్చిన ప్రభుత్వాధికారిపై దర్యాప్తు లేదా విచారణ జరపాలంటే సంబంధిత విభాగం నుండి ముందస్తు అనుమతి తీసుకోవటం తప్పనిసరి. ఈ నిబంధనను సవాలు చేస్తూ ఓ స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్ పై ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం జనవరి 13, 2026న తీర్పునిచ్చింది. అయితే జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్ భిన్నా భిప్రాయాల్ని వ్యక్తం చేస్తూ వేర్వేరు తీర్పులివ్వటంతో కేసు విస్తృత ధర్మాసనం ఏర్పాటు రీత్యా ప్రధాన న్యాయమూర్తి వద్దకు వచ్చింది.

**ఎవరి తీర్పు ఏమిటి?**

రాజ్యాంగ విరుద్ధం: అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ '17ఎ' రాజ్యాంగ విరుద్ధం, రద్దు చేయాలని జస్టిస్ నాగరత్న అభిప్రాయపడ్డారు. అవినీతి ఆరోపణలు వచ్చిన అధికారిపై విచారణకు ముందస్తు అనుమతి తీసుకోవాలనే నిబంధన.. ఆ చట్ట లక్ష్యానికే విరుద్ధమన్నారు. దర్యాప్తుకి అనుమతి ఇవ్వాలా, వద్దా అని నిర్ణయించటానికి ఒక స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేసి ఉండాల్సిందన్నారు.

**అధికారుల రక్షణకు అవసరం:** నిజాయతీపరులైన అధికారులకు రక్షణ అవసరం కాబట్టి.. సెక్షన్ 17ఎ రాజ్యాంగ సమ్మతమేనని జస్టిస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. దర్యాప్తునకు అనుమతి ఇవ్వాలా, వద్దా అన్నది లోకాయుక్త/ లోక్‌పాల్ నిర్ణయించాలన్నారు. పాలనా వ్యవహారాలలో అధికారులు ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవటానికి, ప్రతిభావంతులు ప్రభుత్వ సర్వీసులలోకి రావటానికి ఇది దోహదపడుతుందన్నారు.

**దుర్వినియోగం**

17ఎ ను చేర్చి ప్రభుత్వోద్యోగులు సహా ప్రజాసేవకులకు




**2015 సమయంలో 17ఎ, 8 సవరణలకు వ్యతిరేకంగా జేపీ నిర్వహించిన క్యాంపెయిన్‌పోస్టర్**

మినహాయింపు ఇవ్వటంతో ఈ చట్టం దుర్వినియోగమవుతోందన్న అభిప్రాయం ఉంది. 2018 జులై చివరి వారంలో చట్టం అమల్లోకి రాగా, ఆ తర్వాత ఎంతమందికి అవినీతి కేసుల్లో చర్యలకు అనుమతిచ్చారు, ఇవ్వలేదు గణాంకాలు సక్రమంగా అందుబాటులో లేవు. చాలా పారదర్శకంగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఈ వివరాల కోసం చివరికి సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వాన్ని అడగాల్సి వచ్చింది. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, 40-50 శాతం దాకా కేసులకు అనుమతి లభించలేదు.

**అవినీతి తగ్గలే**

ఇదేసమయంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఏమైనా తగ్గిందా అంటే.. ప్రత్యేకించి ఈ చట్ట సవరణ వల్ల తగ్గలేదనే సమాధానమే వస్తోంది. సాంకేతికత వినియోగం పెరగటంతో కొంతమేరకు తగ్గినా, ఆ పరిధిని కూడా తప్పించుకుని అవినీతికి పాల్పడుతున్నారని వార్తలు సూచిస్తున్నాయి. అదేవిధంగా, ఈ 17ఎ ను అడ్డం పెట్టుకుని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వంలోని పెద్దలకు సన్నిహితులుగా ఉన్న కొందరు పెద్దలు తప్పించుకున్నారనే విమర్శలున్నాయి.

ఫలానా కేసులో 17ఎ ఆ మంత్రి గారికి, ఈ ఎమ్మెల్యే గారికి (వీరు కూడా ప్రజాసేవకుల పరిధి లోకి వస్తారు కాబట్టి) వర్తిస్తుందా అని హైకోర్టులు పలు సందర్భాల్లో అడిగాయి. అదేవిధంగా, 2023 సెప్టెంబర్‌లో అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబును ఒక అర్థరహిత కేసులో జైలులో పెట్టిన ప్పుడు, సుప్రీంకోర్టులో 17 ఎ ప్రస్తావన వచ్చింది. ఈ నిబంధన ప్రకారం చంద్రబాబును విడుదల చేయాలని కోరినప్పుడు, జడ్జీలు ఇప్పటిలాగే విభేదిస్తూ చెరో రకమైన తీర్పునిచ్చారు. ఈ సవరణ పరిధి ఏమిటి అన్నది తరచూ వివాదాస్పదమవుతోంది.

***జేపీ చెప్పిన నిర్మాణాత్మక పరిష్కారాలు***

2016లో ఈ చట్ట సవరణ కోసం ప్రయత్నాలు ప్రారంభించినప్పుడు జేపీ నిర్దిష్టంగా వ్యతిరేకిస్తూ అందుకు హేతుబద్ధ, రాజ్యాంగబద్ధ కారణాలను వివరించారు. భారతీయులు నిజాయతీలో ప్రపంచంలో ఎవరికీ తీసిపోరని, వ్యవస్థీకృత ఏర్పాట్లు కొరవడటం వల్ల అవినీతి ఒక తలుపు మూస్తే ఇంకో తలుపు తెరుచుకుంటూ వ్యాపిస్తోందని తెలిపారు. అదేవిధంగా అవినీతికి ఒకటే విధానం సరిపోదని, ఒక్కో క్యాన్సర్‌కి ఎలాగైతే ఒక్కో రకమైన చికిత్స చేస్తారో.. అవినీతికి అలాంటి చట్టబద్ధ ఏర్పాట్లు ఉండాలన్నారు. ఉదాహరణగా, 2జీ స్పెక్ట్రమ్ కేసులో 2011లో మిగతావారంతా నిందితుల అరెస్టు గురించి మాట్లాడితే, లోక్‌సత్తా మాత్రం దేశ ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు 122 లైసెన్స్‌ల్ని రద్దు చేయాలని పోరాడింది. అదేవిధంగా, ఇక ముందు అలాంటి లాలూచీ అవినీతి జరగకుండా, విలువైన ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పద్ధతిని అనుసరించాలని కోరింది. సుప్రీంకోర్టు ఆ లైసెన్స్‌ల్ని రద్దు చేసి పదుల వేల కోట్ల ప్రజాధనాన్ని కాపాడటమే కాకుండా, వేలం పద్ధతి అనుసరించాలని తీర్పునిచ్చింది. దీనివల్ల అప్పటి నుంచి ఇప్పటి వరకూ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో ఒక్క రూపాయి కూడా అవినీతి లేదు. ఈవేళ తెలంగాణలో సింగరేణికి బొగ్గు గనుల కేటాయింపు విషయంలో వేలం పద్ధతి విషయంలో నిబంధనల్ని మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేయటంతో ఎంత వివాదం జరిగిందో మనకు తెలుసు. దొరికితే దొంగలు, లేకుంటే దొరలు, ఆసాములు. అగ్ర కులం, నిమ్న కులం తేడా లేదు.. అలా దోచేస్తున్నారు. అదే విధంగా, గతిలేక లంచం ఇచ్చిన సామాన్య ప్రజలకు కూడా ఏడేళ్లపాటు జైలుశిక్ష విధించేలా సెక్షన్ 8 కి చేసిన అసమర్ధ, మూర్ఖపు సవరణను కూడా లోక్‌సత్తా తీవ్రంగా, సకారణంగా ఆక్షేపించింది. జేపీ కృషి వల్ల వచ్చిన వేలం పద్ధతి, లోక్‌సత్తా ప్రతిపాదించిన సిటిజన్ ఛార్టర్స్, ఆలస్యమైతే పరిహారంతో కూడిన రైట్ టూ సర్వీసెస్ నుండి ఎన్నికల సంస్కరణల వరకు వివిధ చర్యలు తీసుకుంటే అవినీతి చాలా వరకు కట్టడి అవుతుంది. అంతేతప్ప 17ఎను చేర్చటం వల్ల ఇంకా సమస్య పెరుగుతుందని జేపీ మోదీకి, సోనియా, ఎంపీలకు రాసిన లేఖలో తెలిపారు. 2016 నవంబర్‌లో ప్రభుత్వానికి, పార్లమెంటుకి జేపీ రాసిన లేఖలోని **ముఖ్యాంశాలు:**

"చట్టం ముందు అందరూ సమానమే. అవినీతి ఆరోపణలో ప్రభుత్వాధికారులను దర్యాప్తు చేయటానికి ప్రత్యేక అనుమతి అక్కర్లేదు.. అని మే, 2014లో ఇచ్చిన తీర్పులో స్పష్టంగా పేర్కొంటూ ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం సెక్షన్ '6ఎ' ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అయినా మళ్లీ అలాంటి 17ఎ సవరణను ప్రతిపాదించారు. విధానపరమైన నిర్ణయాలలో సదుద్దేశంతో పొరపాట్లు చేసిన ప్రభుత్వాధికారులకు కచ్చితంగా రక్షణ కల్పించాల్సిందే. అయితే అందరు ప్రభుత్వోద్యోగులకు, అన్ని అవినీతి ఆరోపణలలో రక్షణ కల్పిస్తామనటం రాజ్యాంగ విరుద్ధం. మరోవైపు, ప్రభుత్వ కార్యాలయాలలో హక్కుగా అందాల్సిన జనన ధ్రువపత్రాలు, తాగునీటి కనెక్షన్, పట్టాదారు పాస్‌పుస్తకం, విద్యుత్ అవసరాలు, భూముల రికార్డులు, పోలీసు స్టేషన్ లో ఫిర్యాదులు వంటి వాటికి గతిలేక ప్రజలు లంచం ఇస్తామనటాన్ని కూడా నేరంగా నిర్వచించారు. ఈ సేవలకు లంచాలిచ్చిన సామాన్యులకు 3 నుండి 7 ఏళ్ల కారాగార శిక్ష విధించేలా సెక్షన్ 8 పేరుతో సవరణ ప్రతిపాదించారు. హక్కుగా రావాల్సిన సేవలకు బలవంతపు లంచం ఇవ్వటానికి, లాలూచీ పడి దేశానికి నష్టం వచ్చే పనులకు లంచం ఇవ్వటానికి మధ్య మౌలికమైన తేడాను ఇందులో ఏ మాత్రం గుర్తించలేకపోయారు".

నిస్సహాయ సామాన్య ప్రజలను శిక్షించేలా, ప్రభుత్వోద్యోగులు, ప్రజాప్రతినిధుల అవినీతిని పెంచి పోషించేలా తయారుచేసిన అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లు (2013 నుంచి ఈ సవరణ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆ తర్వాత ఎన్నికలు వచ్చి మోదీ ప్రభుత్వం రావటంతో 2018లో ఆమోదింప చేసుకున్నారు)కి **ఈ దిగువ దిద్దుబాట్లు చేయాలని జేపీ సూచించారు:**

***1) అన్ని రకాల ఆరోపణలపై అందరు ప్రభుత్వోద్యోగులకు రక్షణ కల్పించే 17 ఎ సవరణను తొలగించి, ప్రభుత్వ స్థాయిలో విధాన సిఫార్సులు, నిర్ణయాలకు సంబంధించిన అంశాల్లో మాత్రమే ముందస్తు అనుమతి నిబంధన ఏర్పాటు చేయాలి.***

***2) లాలూచీ అవినీతికి, గతిలేక లంచం ఇవ్వటానికి మధ్య తేడాని స్పష్టంగా నిర్వచించాలి.***

***3) గత్యంతరంలేక బలవంతంగా లంచాలిచ్చే ప్రజలకు రక్షణ కల్పించటంతోపాటు అవినీతికి పాల్పడ్డ అధికారులను శిక్షించేలా న్యాయమైన నిబంధనలను ప్రవేశపెట్టాలి.***

సుప్రీంకోర్టు తాజా తీర్పు సందర్భంగానైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు 2018లో చేసిన పొరపాటును దిద్దుకుంటాయని, 17ఎ, 8 సవరణల్ని రద్దు చేస్తాయని ఆశిద్దాం. అదే విధంగా, ప్రజాసంఘాలు, పౌర సమాజం, మీడియా కూడా కాస్త ఆలోచనతో, దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించాలి. ఏఐ సాంకేతికతతో పరిశోధన స్థాయి సమాచారం అందుతున్నా, ఇతర దేశాల్లో అవినీతి ఎలా పోయిందో మనం పట్టించు కోకపోతే ఇంకెందుకు? నిజాయతీ, ధర్మనిరతి గల సమాజంగా ప్రజలు కూడా తమ పరిధిలో కాస్త కామన్‌సెన్స్‌ని ప్రదర్శించాలి.

అవినీతిని వ్యతిరేకించే సమాజమైనా, మనం ఆ అంశం పట్ల కూడా భావోద్వేగ సందర్భాల్లోనే స్పందిస్తున్నాం. ఉదాహరణకు, లోక్‌పాల్ ఉద్యమం. ఇప్పుడు లోక్‌పాల్ ఎవరో, అందుకోసం అన్నా హజారే, అరవింద్ కేజ్రీవాల్ వంటి వారు చేసిన పోరాటం ఎందుకు విఫలమైందో ఎవరూ పట్టించుకోవటం లేదు. కానీ అవినీతి పోకుండా, చట్టం అందరికీ సమానంగా వర్తించకుండా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగవని మనం గుర్తించాలి. దీనికోసం రోడ్లెక్కనక్కర్లేదు. దామాషా ఎన్నికలతో ఓట్ల కొనుగోలు అవసరం లేకపోవటం వరకూ జేపీ చెబుతున్న సంస్కరణల్ని చర్చించి అమలు చేస్తే చాలు.

# 1974 నుండి ఉద్యమాల అధ్యయనం..
# రాష్ట్రాలను నివేదిక కోరిన కేంద్ర హెూం మంత్రిత్వశాఖ

ఆ ఉద్యమం ఎందుకు జరిగింది, ఎలా మొదలైంది, ఉద్యమం వెనుక ఎవరున్నారు, ఉద్యమ భావజాలం, నిర్మాణం, ఏవైనా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయా, ప్రజల్ని ఉద్యమస్థలికి ఎలా తరలించారు, ఉద్యమం ఎలా బలోపేతమై వ్యాప్తి చెందింది..యూనియన్ ప్రభుత్వం మొట్ట మొదటిసారిగా అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాలకు సంధించిన కొన్ని ప్రశ్నలు.

ఆందోళనల పట్ల వ్యవహరించటానికి ఒక ప్రామాణిక పద్ధతిని (ఎస్.ఓ.పీ) తయారుచేయాలని హోం మంత్రి అమిత్ షా ఆదేశించటంతో బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డి) ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియ చేయాలని ఆయా రాష్ట్రాలు, యూటీల పోలీస్ చీఫ్‌లకు ఆదేశాలు జారీ చేశారు. స్వతంత్రం వచ్చాక, ముఖ్యంగా 1974 నుండి ఇప్పటి వరకూ జరిగిన అన్ని ప్రధాన ఆందోళనల వివరాలనూ అందించాల్సుంది. దేశ అంతర్గత భద్రతను దెబ్బతీసే కుట్రపూరిత ధోరణితో కొన్ని శక్తులు అహేతుకంగా ఆందోళనలు రెచ్చగొడుతున్న సంఘటనలు స్వదేశంలోనూ, చుట్టుపక్కల దేశాల్లోనూ పెరుగు తుండటంతో హోం శాఖ అప్రమత్తమైనట్లు సమాచారం.

ఆందోళనలు, నిరసనలకు సంబంధించి సమాచారం సాంకేతికంగా ప్రభుత్వానికి అందుతుంటుంది. శాంతి భద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశమైనా, అవసరమైనప్పుడు, ముఖ్యంగా అంతర్రాష్ట్ర దర్యాప్తు అవసరమైనప్పుడు, దేశ భద్రతకు ప్రమాదంగా మారే అవకాశం ఉన్నప్పుడు ముందు జాగ్రత్తగా సమాచారాన్ని యూనియన్ ప్రభుత్వానికి రాష్ట్రాలు అంద చేస్తుంటాయి. కానీ మొదటిసారిగా ఒక విధాన రూపకల్పనకు గత యాభై ఏళ్ల రికార్డును కోరటం జరిగింది.

యూనియన్ హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పోలీస్ థింక్ ట్యాంక్ స్వతంత్ర భారతంలో గత 50 ఏళ్లకు పైగా కాలంలో చోటు చేసుకున్న ప్రధాన ఆందోళనల వివరాలు తెలియచేయటం కోసం 13 ప్రశ్నలతో పత్రాన్ని పంపింది. ఇందులో సంవత్సరం, ప్రాంతం, నిర్వాహకులు, ఎంతమంది పాల్గొన్నారు, ఉద్యమం చివరికి ఎలాంటి ఫలితాలు సాధించింది మొదలైన అన్ని అంశాల వివరాలనూ తెలియచేయాలి. ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, మరణాలుంటే వాటి వివరాలు, అటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నివారించేందుకు ఏవైనా చర్యలు, సూచనలు కూడా తెలియ చేయమని అడిగారు. జాతీయ రక్షణ వ్యూహాల సమావేశం 2025 సిఫార్సులకనుగుణంగా ఒక డాక్యుమెంట్



రూపంలో ఈ నివేదికను ఇవ్వాలి. 1974 నుండి వివరాలు ఇవ్వమని ప్రత్యేకించి చెప్పినప్పటికీ, దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుండి అన్ని ఆందోళనలనూ అధ్యయనం చేయమని కోరారు. ఇందుకోసం అనుభవమున్న, యువ పోలీసు అధికారుల బృందాలను ఏర్పాటు చేయమని సూచించారు. ఆయా ఆందోళనలకు సంబంధించి తెర వెనుక ఉన్న శక్తుల పాత్రను కూడా తెలియచేయమని కోరారు. ఆర్థిక పరమైన అంశాలుంటే ఆ రంగంలోని నిపుణుల చేత విశ్లేషణలు చేయించాల్సుంటుంది. ప్రభుత్వం ఆందోళనలపై సమగ్ర అధ్యయనం చేయటం ద్వారా ఇప్పటికైనా మౌలిక సమస్యల్ని గుర్తించటం అవసరం. ఉదాహరణకు, మనం గబుక్కున చెప్పగలిగే 2జీ స్పెక్ట్రం కుంభకోణంపై ఆందోళనలు, అదే నేపథ్యంలో లోక్‌పాల్ కోసం అన్నా హజారే నిరాహార దీక్ష, నిర్భయ ఉదంతం ఆందోళనలు, పౌరసత్వ సవరణ చట్టానికి (సీఏఏ) నిరసనలు, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సుదీర్ఘ ఆందోళనలు, కామన్ సివిల్ కోడ్ నిరసనలు కాకుండా, 2009-2019 కాలంలో దేశంలో మొత్తం 20,000 ఆందోళనలు జరిగినట్లు అంచనా. వీటిని ఎలా అణచివేశారు, నేపాలో, మెడగాస్కరో, మరో దేశంలోలా అవి పెచ్చరిల్లకుండా ఎలా నియంత్రించారు వంటి అంశాల గురించి ఎస్.ఓ.పీ అయితే పెద్ద ఉపయోగం ఉండదు. అది ఎలాగూ చేస్తున్నారు. చాలాసార్లు అత్యుత్సాహంతో చేస్తున్నారు. చట్టాల్ని తెలియని పోలీసులు కూడా చట్టబద్ధపాలన అమలు చేస్తున్నారు. రోడ్ల మీద ఆందోళనలు భారతీయ సంస్కృతిలో భాగంకాదని వాదిస్తే సరిపోదు. అప్పటి ప్రజాస్వామ్యానికి, ఆధునిక సువిశాల దేశ ప్రజాస్వామ్యానికి తేడా ఉంది. అదీగాక, బ్రిటిషర్ల వలస పాలనపై పోరాటంలో భాగంగా గాంధీజీ మాస్ పాలిటిక్స్‌ని,

రోడ్ల మీద నిరసనల్ని, బంద్‌లని ప్రోత్సహించారు. కానీ ఎక్కడా హింసకు తావివ్వకుండా కఠినంగా వ్యవహరించారు. తీవ్ర విమ ర్శలను ఎదుర్కొన్నా.. అహింసకు కట్టుబడి ఉన్నారు. అదీకాదు.. భారతీయ సంస్కృతి అంటే, బ్రిటిష్ వారికి, విదేశీ దండ యాత్రలకి ముందుకాలం మాత్రమే అనుకుంటే అది అసంపూర్ణ మవుతుంది. చరిత్రలోని అన్ని దశల్లోని మంచినీ భారతీయంలో భాగం చేయాలి. స్వతంత్ర భారతదేశం మనతోనే మొదలైందను కోవటం సిద్ధాంతం కాదు, డొల్ల భావజాలమవుతుంది. కాబట్టి పక్షపాతాల్ని వీడి1970ల నుండి ఇప్పటి వరకూ వాయిదా వేసిన సమస్యల మూలాల అధ్యయనాన్ని ఈ నివేదిక తర్వాతైనా చిత్తశు ద్ధితో చేయటం అవసరం. ప్రజలకు సమస్యలు ఏమి ఉన్నాయి, వారిలో అంత అసంతృప్తి, ఆక్రోశం ఎందుకు పెరుగుతోంది, వీధుల్లోకి వచ్చి వారు ఆందోళన చేసేదాకా అక్కడి ప్రభుత్వ వర్గాలు ఎందుకు పట్టించుకోవటం లేదు, స్వరాజ్యాన్ని సురాజ్యంగా మార్చటంపై పార్టీల మధ్య ఏకాభిప్రాయం కావాలని జేపీ లాంటి రాజ్యాంగబద్ధ పౌరులు, నాయకులు కూడా ఎందుకు నిరాహార దీక్ష చేయాల్సి వచ్చింది, ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన హామీల్ని, రాజ్యాంగంలో చెప్పిన మాటల్ని అమలు చేయటానికి కూడా ఎందుకు ఉద్యమాలు చేయాల్సి వస్తోంది.. మొదలైనవన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సంస్కరణలు తీసుకొస్తే ఇదొక అద్భుత ప్రయత్నంగా చరిత్రలో నిలిచిపోతుంది. అలా చేస్తారని ఆశిద్దాం. ఈ దిశగా పౌర సమాజం, ప్రతిపక్షాలు, మీడియా, ఆలోచనాపరులు, ఇన్ ఫ్లుయెన్సర్లు తమ వంతు కృషి చేయాలి.

# సహకార ఉద్యమనేత మామిడి రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం



సహకార ఉద్యమనేత మామిడి రామారెడ్డికి కేంద్ర ప్రభుత్వం గతనెలలో పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. గతేడాది అక్టోబరులో ఆయన తన 83వ ఏట హైదరాబాద్లో కన్నుమూశారు. శంషాబాద్లో 1943లో భోజిరెడ్డి, నీలమ్మ దంపతులకు జన్మించిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనమిక్స్ డిగ్రీ, అదే విశ్వవిద్యాలయంలో జర్నలిజంలో, తర్వాత దిల్లీ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్‌లో పీజీ చదివారు. అమెరికాలోని ఓ విశ్వవిద్యాలయంలో స్థానిక ప్రభుత్వాలు, ఆర్థికా భివృద్ధి కోర్సు చేశారు. అక్కడి నుంచి స్వదేశానికి వచ్చి 1967-70లో రాజేంద్రనగర్ సర్పంచిగా, 1970-76లో సమితి అధ్యక్షునిగా పనిచేశారు. తన తండ్రి మామిడి భోజిరెడ్డి తదనంతరం మామిడి రామారెడ్డి తనదైన రీతి లో తండ్రి అడుగు జాడలలో నడుస్తూ సహకార ఉద్యమ వ్యాప్తికి విశేషంగా కృషి చేశారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థతో కలిసి పని చేసి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ భావ జాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పాత్ర మరువలేనిది. సహకార చట్టంలో లోపాలపై, సహకార సంఘాలపై ప్రభుత్వ పెత్తనాన్ని ఆయన వ్యతిరేకిస్తూ విస్తృత స్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహించారు. ఇదే లక్ష్యంతో సహకార అభివృద్ధి సంస్థ(సీడీఎఫ్)ను ఏర్పాటు చేశారు. 1990లో కంపెనీల చట్టం కింద సహకార సంఘాలను ఏర్పాటు చేయించారు. వాటికి ప్రభుత్వం ఆమోదం తెలపకపోవడంతో వాటి గుర్తింపునకు ఉద్యమించారు. రామారెడ్డి కృషి ఫలితంగా సహకార సంస్థలపై సభ్యుల నియంత్రణను కల్పిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1995లో పరస్పర సహాయ సహకార సంఘాల (మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీస్-మాక్స్) చట్టం తెచ్చింది. దీనికింద ఆయన సీడీఎఫ్ ద్వారా తెలంగాణలో 585 రైతు, మహిళాసంఘాలు, పురుషుల సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మాక్స్ చట్టం కింద తెలుగు రాష్ట్రాల్లో వేల సంఖ్యలో సంఘాలు ఏర్పాటయ్యాయి. 2002లో వేసిన రామ్నివాస్ మీర్ధా కమిటీతో పాటు 8 రాష్ట్రాల్లో మాక్స్ చట్ట రూపకల్పన కమిటీల్లో సభ్యునిగా చేర్చగా.. ఆయా ప్రభుత్వాలకు సూచనలందించారు.

మామిడి రామారెడ్డికి పద్మశ్రీ అవార్డు ప్రకటించడం పట్ల ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన జీవితం నిండా ఎంతో స్ఫూర్తి, ఎన్నో పాఠాలు, మరెన్నో సాఫల్యతలు ఉన్నాయని పేర్కొన్నారు.


## 'భారత ప్రజాస్వామ్యంలో పౌర సంస్థల ఉద్యమాలు.. పోరాట పంథాలు'పై



# జేపీ నవ పరిష్కారాలు



52 ఏళ్ల ప్రజాజీవితంలో వ్యక్తిగతంగా, వ్యవస్థీకృతంగా రాజ్యాంగాన్ని త్రికరణశుద్ధిగా, ఆ స్ఫూర్తికనుగుణంగా పాటించిన నాయకులు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్. యూనియన్ ప్రభుత్వం స్వతంత్ర భారత్‌లో, ముఖ్యంగా 1974 నుండి ఆందోళన లకు సంబంధించి సమగ్ర వివరాలు పంపాలని రాష్ట్రాలు, యూటీల పోలీసు అధికారులను కోరిన నేపథ్యంలో జేపీ లాంటి వారి సూచనల్ని తీసుకోవటం ఎంతైనా అవసరం. అన్ని రాష్ట్రాల నుండి వివరాలు వచ్చాక వాటిని అధ్యయనం చేయటానికి కేవలం పోలీసు థింక్ ట్యాంక్ నే కాకుండా భారత్ లో రాజకీయ, పాలన, ఆర్థిక, సామాజిక సంస్కరణలపై ఎంతో అవగాహన ఉన్న జేపీ వంటి వారితో ఒక కమిటీని ఏర్పాటు చేయటం వల్ల మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ఈ సందర్భంగా 'భారత ప్రజాస్వామ్యంలో పౌర సంస్థల ఉద్యమాలు.. పోరాట పంథాలు' పై 2016లో జయప్రకాష్ నారాయణ్ రాసిన వ్యాసంలోని పరిష్కారాలను పాఠకుల దృష్టికి తెచ్చే ప్రయత్నమిది. జేపీ ప్రతిపాదించిన 9 పరిష్కారాలకు 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' టి.ఎన్ చతుర్వేది పురస్కారాన్ని అందచేసింది. ప్రజల సమస్యలపై ప్రభుత్వాలు సకాలంలో స్పందించకపోవటం, ఎన్ని రకాలుగా ఆందోళనలు చేసినా ప్రభుత్వాలు స్పందించ లేదు కాబట్టి అంటూ జనజీవితాలకు ఆటంకం కలిగించే పోరాటపద్ధతులను అనుసరించే ధోరణులు పెరగటం నేపథ్యంలో.. విధానాల్లో మార్పు కోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవటానికి స్వచ్ఛంద సంస్థలు అనుసరించాల్సిన పద్ధతులపై జేపీ రాసిన వ్యాసం ప్రామాణికమైనదిగా, అందులో చూపిన పరిష్కారాలు అత్యంత ప్రాధాన్యమైనవిగా, రాజకీయ పార్టీలకు కూడా అవసరమైనవిగా అవార్డు ఎంపిక కమిటీ పేర్కొంది.



కొందరు వ్యక్తులు, కార్పొరేట్లకు ప్రభుత్వం నుండి ఆర్థిక ప్రయోజనాలను సాధించటానికి పనిచేసే సంస్థలు, లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ప్రజలకు సేవ చేయాలనుకునే సంస్థలు .. రెండూ ఒత్తిడి (లాబీయింగ్) బృందాలే అయినప్పటికీ, లక్ష్యాలు, విస్తృతి రీత్యా రెంటినీ వేరుగా చూడాలని వ్యాసంలో జేపీ అన్నారు.

స్వతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచినా మన దేశంలో ప్రభుత్వాల పాత్ర, పౌర ఉద్యమాలు.. ఆందోళనా పద్ధతులపై ఉన్న గందరగోళాన్ని జేపీ తొలుత ప్రస్తావించారు. ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా, ఎన్నికల మధ్య కాలంలోనూ తమ ఇష్టాలు, అభిప్రాయాల కనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వాల విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ ఉందన్నారు. ఇందు కోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు ఉందన్నారు. అయితే ఎన్నికైన ప్రభుత్వ చట్టబద్ధ బాధ్యతను హరించే, ప్రజాస్వామ్యాన్ని స్తంభింపచేసే రీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదన్నారు. ప్రభుత్వాన్ని మనమే ఎన్నుకుని, ఎన్నికలైన మరుసటి రోజు నుండి మనకు నచ్చినట్లు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలకే విఘాతం కలిగిస్తుం దన్నారు. ఎంతో శక్తిమంతమైన, వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటానికి గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళనా పద్ధతుల్ని అనుసరించారన్నారు. గాంధీ అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయన్నారు. అయితే స్వతంత్ర ప్రజాస్వామ్య దేశంలో కూడా అవే ఆందోళనా పద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదని జేపీ స్పష్టం చేశారు. జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకులపై పోరాటానికి.. మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా

గుర్తించలేకపోతున్నాయన్నారు. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅపూలేని చట్టధిక్కారాల వల్ల తలెత్తే దుష్పరిణామాల గురించి డాక్టర్ అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారన్నారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ బలానికి అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే తగిన ఫలితాలు రావన్నారు.

**ఈ నేపథ్యంలో జేపీ చేసిన నవ సూచనలు:**

1)పౌర సంస్థ వ్యక్తుల, కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాల లాబీయింగ్ కోసం పనిచేస్తుంటే.. దేశ ప్రయోజనాల దృష్ట్యా రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ, పారదర్శకత విషయంలో నిబంధనల్ని కచ్చితంగా పాటించటం, నియంత్రించటం అవసరం.

2)వివాదాస్పద అంశాలు, ప్రజల మధ్య విభజన తెచ్చే అంశాల మీద పనిచేసే పౌర సంస్థలు ఎన్నికైన ప్రభుత్వానికి విధానాల్ని నిర్దేశించటంలో తన పరిమితిని గుర్తించాలి. విధానాలపై రాజకీయ విభేదాలు సహజం. సాధ్యమైనం తవరకు అవి ప్రజాక్షేత్రంలో, ప్రజల తీర్పుతోనే తేలాలి. ప్రజల తక్షణ అవసరాలకు, దీర్ఘకాలిక ప్రయోజనాలకు మధ్య సమన్వయం చేయాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రభుత్వాల కుంటుంది. కొద్దిమంది తరపున వివాదాస్పద అంశాల కోసం నియంత్రణలేని ఒత్తిడి చేసే సంస్థల వల్ల ప్రజాప్రయోజనాలు దెబ్బతింటాయి. పరిపాలన అసాధ్యమవుతుంది.

3)ప్రభుత్వ మౌలిక బాధ్యతల విషయంలో రాజకీయ పార్టీలు, మీడియా, పౌర సమాజం మధ్య స్థూల ఏకాభిప్రాయం ఉండాలి. జాతీయ భద్రత, శాంతి భద్రతలు, న్యాయం, చట్టబద్ధపాలన, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సహా మౌలిక వసతులు అందించటం ఆధునిక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన కనీస బాధ్యతలని అందరూ గుర్తించాలి.

4)ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వానికి, దేశ వ్యవస్థలకు తాము ప్రత్యామ్నాయం కాదని పౌర సంస్థలు గుర్తించాలి. రాజకీయ ప్రక్రియ పట్ల గౌరవం; నిరంతరం, నిర్మాణాత్మకంగా హేతుబద్ధ వాదనలు, సాక్ష్యాలతో మార్పు కోసం పనిచేయటం ఈ ఒత్తిడి బృందాల లక్షణాలుగా ఉండాలి.

5)రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో కొన్ని ఆమోదయోగ్య విధానాలతో పార్టీలు, పౌరులు, పౌర సంస్థల కార్యాచరణ ఉండాలి. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంస్థలుగా ఏర్పడే హక్కు, ఓటు.. ఇవి ఉన్నాక జన జీవితాల్ని ఆటంకపరిచే ఆందోళనా పద్ధతులకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదు. ఈ రాజ్యాంగ పద్ధతుల ద్వారానే పెట్రోలు బంకుల్లో అక్రమాల్ని అరికట్టటం, ఓటరు రిజిస్ట్రేషన్‌లో అవకతవకల్ని సరిచేయటం,

> **జాతీయ భద్రత, శాంతి భద్రతలు, న్యాయం, చట్టబద్ధ పాలన, పుట్టుకతో వివక్ష లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సహా మౌలిక వసతులు అందించటం ఆధునిక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాలు చేయాల్సిన కనీస బాధ్యతలని అందరూ గుర్తించాలి.**

అభ్యర్థుల నేరచరితుల వివరాలు బయట పెట్టటం, పాలనా సమాచార హక్కు చట్టం (ఆర్.టి.ఐ), సహకార సంఘాల స్వయంప్రతిపత్తి, గ్రామ (స్థానిక) న్యాయాలయాలు, జాతీయ జ్యుడీషియల్ అపాయింట్ మెంట్స్ కమిషన్ (ఎన్.జే.ఏ.సీ) వంటి దాదాపు 16 కీలక చట్టాల్ని, 4 రాజ్యాంగ సవరణల్ని అందరినీ సమన్వయం చేసుకుంటూ లోక్‌సత్తా/ఎఫ్.డి.ఆర్ సాధించాయి.

6)ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థా సర్వాధికారి కాదు. ఎవరైనా జవాబుదారీగా ఉండాల్సిందే. ప్రజలు స్వేచ్ఛగా వేసిన ఓటుతో తాము ఎన్నికయ్యామన్న స్పృహ పాలకులకు ఎప్పుడూ ఉండాలి.

7)చట్టసభలు ప్రజాస్వామిక చర్చ, పరిష్కారాలకు సరైన వేదికలని పార్టీలు, ప్రతిపక్ష నేతలు, సభ్యులు గుర్తించాలి. చర్చను, సభ్యులు స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేయటాన్ని నియంత్రిస్తూ పార్టీలు విప్ జారీ చేయటం నాగరిక ప్రజాస్వామ్యం అనిపించుకోదు. చట్టసభల వైఫల్యం ప్రజాస్వామ్యాన్ని పతనం చేస్తుంది.

8) రాజకీయ వ్యవస్థల్లో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు పార్టీల్ని, ఎన్నికల ప్రక్రియను సంస్కరించాలి. సమర్థత, సేవాభావం, నిజాయతీ కలిగినవారు సామాన్యులైనా వేగంగా, నైతిక పద్ధతుల్లో, ప్రత్యామ్నాయ విధానాలు చూపుతూ ఎదిగగలిగేలా, ఎన్నికల్లో గెలవగలిగేలా సంస్కరణలు ఉండాలి. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి.

9)మీడియా బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంచాలి. విద్వేషం, ప్రజల మధ్య చిచ్చు పెట్టటం, ఒకరికి లాభం ఇంకొకరికి నష్టమనేలా జీరోసమ్ చర్చ చేయటం.. హేతుబద్ధ నిర్ణయాలను, తద్వారా ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తుంది గుర్తించి వ్యవహరించాలి.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

Jugaad Bharat United Voters

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## Jugaad Bharat United Voters February 2026

Simplifying Democracy - Strengthening Unity among voters

## అదే జుగాడ్ 50:50 రాజనీతి

## శభాష్ భారత్!

1. 2026 గణతంత్ర దినోత్సవ సంబరాల్లో మన భారతదేశ ప్రధాని Narendra Modi ప్రపంచ వాణిజ్య రంగంలో అత్యంత ప్రతిష్టాకరమైన 27 సంపన్న-యూరోపియన్ దేశాలతో. పారదర్శకముగా కుదుర్చుకున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (ఒప్పందానికి) వారిని అభినందిస్తున్నాను. ఇకపై కార్లు, ద్రాక్షరసాలు, బీర్లు మనదేశంలోనే చవకగా కొనుక్కోవచ్చు! 1947 ఆగస్టు 15నుండి కేవలం మతమే ఆధారంగా, విభజింపబడ్డ భారతదేశంలో పుట్టిన పౌరులందరూ, చట్టబద్ధపాలనలో ఎవరి అభి(మతాన్ని) వారు స్వేచ్ఛగా ప్రకటించుకోవచ్చు! ఈ ఆజాదీకా-అమృతకాలంలో శ్రీ మోడీ గారికి “భారతరత్న” బిరుదుని suo-motu ప్రకటించవలసిందిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారికి జుగాడ్ ఓటరుగా నా విన్నపం!

2. తెల్లదొరల IMPERIALISM (సామ్రాజ్యవాద భావజాలం) నుండి విముక్తి పొందిన కొత్తలో పరిమితసంఖ్యలో పొలిటికల్ పార్టీలు ఉండగా - నేడు అవి సంఖ్యాపరంగా 2000 దాటి, 59 రాష్ట్ర పొలిటికల్ పార్టీలుగా దేశంలో చలామణి అవుతూ స్వేచ్ఛగా అవినీతి పరిపాలన (Corrupt Administration) సాగిస్తున్నాయి. ఉచిత సంక్షేమ-పథకాల పేరుతో కొన్ని పార్టీలు ఓటర్లను సోమరిపోతులుగా తయారు చేస్తున్నాయి. లేదా కులం మతం ప్రాంతం భాష యాస మద్యపాన నిషేధం మొదలైన అంశాలతో ఓటర్లను విడగొడుతున్నాయి. ప్రపంచంలో బంగారం ధరలు మండిపోతుంటే తెలుగు రాష్ట్రాలలో మాత్రం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో “పేద కుటుంబాలకి” అంటూ, బంగారం ఉచిత పంపిణీ సాధ్యమా..?

3. ఇందిరమ్మ ఇళ్లు మన అందరికీ ఉచితంగా కావాలి. కానీ ఇందిరమ్మ ఎమర్జెన్సీ ద్వారా ప్రవేశపెట్టిన దైనందిన జీవితంలో పౌరులు పాటించవలసిన కుటుంబ నియంత్రణ, క్రమశిక్షణ, సమయపాలన, పౌరులు స్వీకరించవలసిన బాధ్యతల గురించి మనం పట్టించుకోవడం లేదు. 1972లో వచ్చిన ఎమర్జెన్సీని అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఒక “అంతర్గత సర్జికల్ స్ట్రైక్” లాగా భావించవలసి ఉంటుంది. నాటి కాంగ్రెస్ ఎమర్జెన్సీ పెట్టకపోయి ఉంటే నేటి మన దేశానికి బిజెపి ద్వారా ఈ మహర్దశ వచ్చి ఉండేది కాదు. ఈ రెండు పార్టీల మధ్య సయోధ్య లేదు. అందుకే సుపరిపాలనకై జుగాడ్ 50:50 రాజనీతి తో ద్విపక్ష పార్టీ ఆవశ్యకత!

**Contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

జుగాడ్ భావి భారత భాగ్య విధాతలు : (Rs/-10,000 donors)

**Sarvasri: (1) M.PARTHASARATHY (2) K.SUBRAHMANYAM (3) Col.P.V.RAMANA RAO (4) U.SUBBA RAO (5) Prof.C.K.MURTHY (6) SYED ANSARI (7) Smt. D.KASTURI (8) K.SRINIVAS MURTHY (Rajahmundry AP) (9) Dr. VAMSI RAJ (Kakinada AP) (10) Dr.G.ABBAIAH (Kakinada AP)(11)KOTIKALAPUDI TARAKESH**

**జుగాడ్ ఓటర్లు : Sarvasri (1) JVL. NARAYANA (Nellore AP) (2) S.D.BABU (Tamilnadu) (3) T.SURYANARAYANA (Vizag AP) (4)Smt.D. SUBHADRA (5) M.RANGA RAO (6) M.SAI SUBBARAO (7) Smt.D.JANAKI (8) J.VENKATA RAO (Vijayawada AP) (9) P.NARASIMHA RAO (10) SAI SURYANARAYANA (Karnataka) (11) MSS KUMAR (12) Dr.U.V.KRISHNA MURTHY (13) M.RAMA RAO (14) NANDAN SRIDHAR (15) Smt.K.RAJESWARI (16) Smt.K.LAKSHMI (17) Justice CHANDRAKUMAR (18) K. VASUDEVA RAO (19) NARAGONI (20) D.KONDALA RAO (21) M.S. Narayana Rao (22) Sriram (Amalapuram AP) (23) P.Sunil (Bhimavaram AP) (24) Amaranath (25) B.Poorna Kumar Das (26) KHS Sarma (27) Metta Ramarao (Vizag, AP) (28) IR Rao (29) S Madhavarao (30) DRK Rao (31) Smt.P Amulya (32) pallela Devaraju (33) YSN MURTY (Kakinada, AP) (34) DV KOTESWARA RAO (35) Santosh Eeraveni (36)Somanchi Radhakrishna 37) C.V.Ratnam 38) Smt Jayanti Vijaya 39) Vishnubhotla Venugopal**

advt

# యంగ్ లీడర్స్ డైలాగ్ 2026 .. జిల్లా ప్రభుత్వాలు

భారతదేశంలో 35 సంవత్సరాలలోపు యువజనాభా సుమారు 70% దాకా ఉన్నారు. వారిలో జెన్ జడ్ గా పిలిచే 15-29 వయసువారు సుమారు 28%. పదిహేను ఏళ్ల లోపు జెన్ ఆల్ఫా దేశ జనాభాలో సుమారు 25.5% ఉన్నారు. వారు పాఠశాల స్థాయిలో ఉన్నారు.

సమాజాన్ని, రాజకీయాన్ని ప్రభావితం చేసే వయసులో ఉన్నవారు జెన్ జడ్. అయితే ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా.. ఇటీవల ఓటర్ మూడ్ తెలుసుకునేందుకు చేసిన ప్రీ పోల్ సర్వేలు, ఓటింగ్ పరిణామాలు, ఎగ్జిట్ పోల్స్, వివిధ కళాశాలల్లో చర్చా కార్యక్రమాలను చూస్తే, జెన్ జడ్ లో తమ చట్టసభ ప్రతినిధులను ఎన్నుకోవటం పట్ల అనాసక్తత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రత్యక్ష రాజకీయాలకు సంబంధించి వారి ఆలోచనా విధానాన్ని చూస్తే,. గుర్తింపు, అధికారం ద్వారా ఏదైనా సాధించేయొచ్చు అనే ఊహలు తప్ప - ప్రత్యేకించి ఒక లక్ష్యాన్ని సాధించాలి, అందుకోసం ఏ రకంగా పనిచేయాలని, ఎంత నిలకడగా వ్యవహరించాలి అన్న అవగాహన చాలా సందర్భాల్లో కొరవడుతోంది. ఎవరైనా సేవ చేద్దామని నిజాయతీగా, కష్టార్జితంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినా.. కొన్ని ఎదురుదెబ్బలు తినగానే 'ఇదంతా మనకు అవసరమా' అని పక్కకు తప్పుకుంటున్నారు. ఇది వారి తప్పు కూడా కాదు. మన రాజకీయం యువతకు ఆ శిక్షణ, "రాజకీయాలు వృత్తి, ఆదాయ మార్గం కాదు; అధికారమంటే పెత్తనం కాదు; ప్రజలకు సేవ చేయాలనుకుంటేనే, కష్టపడటానికి ఇష్టపడితేనే రావాలి" అనే అవగాహన కల్పించటం లేదు.

దీనికితోడు యువతకు సొంత ఆదాయాలు మన దేశంలో చాలా పరిమితంగా ఉన్నాయి. పాఠశాల విద్యావ్యవస్థతో మొదలుపెట్టి - సంక్షేమం, నిరుద్యోగ భృతి; పనిచేయకున్నా మార్కెట్ కంటే బోలెడంత జీతభత్యాలు, లంచాలు, అధికార దర్పం ఉన్న ప్రభుత్వోద్యోగాలభ్రమల్లోవారిని కొనసాగించటం వరకు - పలు అంశాలు ఈ దుస్థితికి కారణం. దీంతో వీలైనంత తక్కువ కష్టంతో కండలు కరగకుండా ఎక్కువ సొమ్ములు సంపాదించటం, మార్కెట్‌లో కల్చర్‌గా చెలామణిలో ఉన్న సౌఖ్యాలను ఎంజాయ్ చేయటం బ్రాండ్ జెన్ జడ్గా మారింది. ఈ ఎంజాయ్‌మెంట్ లో స్మార్ట్ ఫోన్ తో వర్చువల్ ప్రపంచంలో విహరించటం ఒక భాగం కాగా, రెండోది భౌతిక ప్రపంచంలో శూన్యత భర్తీకి ఆధ్యాత్మికత పేరుతో తీర్థయాత్రలు చేయటం. కుంభమేళాలు, కాశీ



యాత్రలుకల్చర్ అయ్యాయి. కష్టపడకుండా సంపాదించాలనుకోవటం లేదా కేవలం స్టాక్ మార్కెట్ పెట్టుబడులు వంటి మార్గాలలో సంపాదించటం, ప్రభుత్వం తన సొంత సొమ్మేదో ఇస్తున్నట్లు భావిస్తూ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఎంత డబ్బు ఇస్తుంది అని కలెక్షన్ కింగ్స్‌లా ఎదురుచూడటంకాకుండా.. సమాజానికి ఉపయోగపడుతూ డబ్బు సంపాదించటం, దేవుడ్ని నమ్మినా నమ్మకున్నా మానసిక ప్రశాంతత కోసం తీర్థయాత్రలు, మఠాల సందర్శన వంటి కార్యక్రమాల్లో పాల్గొనటం అభ్యంతరకరమేమీకాదు. కానీ రాజకీయ నాయకులు ఉచితాలు వంటివి తప్ప ఉపాధి, ప్రతిష్ఠాత్మక సాఫ్ట్ వేర్ కంపెనీల్లో, బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలిప్పించే నైపుణ్యాల్ని అందించటం లేదు, అవినీతికి పాల్పడుతున్నారు అనే నిరసనతో ఓటు వేయకపోవటం, రాజకీయాల్ని పట్టించుకోం కాబట్టి హ్యాపీగా ఉన్నామనుకోవటం, పోలింగ్ రోజు సెలవును ఎంజాయ్ చేయటం, ఫలితాలపై మాత్రం బెట్టింగ్‌లు వంటి మార్గాల్లో సంపాదించే ప్రయత్నం చేయటం.. సరైన దృక్పథం కాదు. ఇందుకు తల్లిదండ్రులు కొంత కారణమైనా, ప్రధాన కారణం మన ప్రజాస్వామ్య రాజ్యవ్యవస్థ నిర్మాణంలో కొన్ని మౌలిక లోపాల్ని దశాబ్దాలుగా కొనసాగిస్తూ రావటం.

యువతకు కావచ్చు, సామాన్య పౌరులకు కావచ్చు పాలన, రాజకీయాలు అర్థం కావాలంటే..తాము నివసించే చోట, అంటే - పంచాయతీల్లో, మునిసిపల్, కార్పొరేషన్ వార్డులలో అధికారాలు, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, దోమల నివారణ వంటి అంశాలపై కమిటీల్లో

వారికి భాగస్వామ్యం ఉండాలి. అప్పుడు తమ రోజువారీ పనులు చూసుకుంటూ, కొంత సమయం రాజకీయం, పాలన కోసం కేటాయించగలుగుతారు. రాజకీయాల్ని వృత్తిగా, సంపాదనా మార్గంగా భావించరు. తమ ఇంటి పక్కన చెత్త ఉంటే - సమస్యకి, పరిష్కారానికి చాలా తేలిగ్గా కనెక్ట్ అవుతారు. ఆలోచిస్తారు. తమ వీధిలో మురుగు పారుతుంటే, కంపు భరించలేక ఏం చేయాలో ఆలోచిస్తారు. మంచినీరులో మురుగునీరు కలిసిపోతుంటే.. తామే కమిటీల్లో ఉంటారు కాబట్టి వెంటనే పరిష్కరిస్తారు. ఈ పని వ్యవస్థీకృతంగా జరిగే ఏర్పాట్లు లేవు కాబట్టే మన వద్ద డబ్బున్నవారు, పార్టీల అగ్రనేతల పిల్లలు, గూండాలు వంటి వారు రాజకీయాల్లోకి వస్తున్నారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియా ద్వారా అబద్ధాల్ని, అభాండాల్ని ప్రచారం చేసి అవతలి పార్టీ, అభ్యర్థుల మీద బురద జల్లటం వంటివి యువతకు ఉపాధి మార్గాలుగా మార్చారు. లేదంటే, ఎన్నికల మధ్యకాలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పార్టీ తరపున పనులు చేసిపెట్టే బ్రోకర్లుగా తయారుచేస్తున్నారు. ఓ 10-20% మాత్రమే నాణ్యమైన ఆదాయ మార్గాలను అందుకోగలుగుతున్నారు. లక్షల మంది వైఫల్యాల మధ్య ఓ గొప్ప సక్సెస్ స్టోరీ చదివి కలలుగంటూ కాలం వృధా చేయటమే. చిన్న పని, పెద్ద పని అనుకోకుండా ఆత్మ గౌరవంతో ఆలోచిస్తే, ప్రభుత్వ పథకాలకు ఆశ పడనక్కర లేకుండా, కష్టపడి సంపాదించుకునే అవకాశాలు మన సమాజంలో ఇటీవల పెరిగాయి. వీరికి జీవన భద్రత, అంటే, రిటైరయ్యాక ఎవరో దయాభిక్ష మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా, సంఘటిత రంగంలో వారికి వర్తించే ప్రయోజనాలు కూడా అందించే ప్రయత్నం చేస్తున్నారు. ఎప్పుడు, ఏ పనిచేయాల్సి ఉంటుందో తెలియని గిగ్ వర్కర్లకూ ఈ సంఘటిత ఉపాధి ప్రయోజనాలను అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది మంచి పరిణామం. దీంతోపాటు, మనం గత జనబలంలో కూడా చర్చించుకున్నాం.. 2025 నుండి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' (వి.బి.వై.ఎల్.డి)అనే కార్యక్రమాన్ని యూనియన్ ప్రభుత్వం ప్రారంభించింది. స్వామి వివేకానంద జయంతిని 1995 నుండి యువజన దినోత్సవంగా జరుపుకోవటం ఆన వాయితీగా వస్తోందిగానీ, ఆ కార్యక్రమాన్ని దండలు, పండ్లు పంచటం, మీడియాలో ఫోటో వంటి మొక్కుబడి చర్యలకు పరిమితం చేయకుండా గతేడాది పునర్నిర్వచించారు. 146 కోట్లలో70 శాతం ఉన్న యువతలో 50% దాకా ఉన్న జెన్ జడ్ ని దేశ నిర్మాణంలో భాగస్వాముల్ని చేసేందుకు ప్రభుత్వం వి.బి.వై.ఎల్.డిని ప్రారంభించింది. ప్రపంచంలోనే అతి పెద్ద యువశిక్షణా కార్యక్రమాలలో ఇది ఒకటి. దేశవ్యాప్తంగా

***146 కోట్లలో70 శాతం ఉన్న యువతలో 50% దాకా ఉన్న జెన్ జడ్ ని దేశ నిర్మాణంలో భాగస్వాముల్ని చేసేందుకు ప్రభుత్వం వి.బి.వై.ఎల్.డిని ప్రారంభించింది. ప్రపంచంలోనే అతి పెద్ద యువశిక్షణా కార్యక్రమాలలో ఇది ఒకటి.***

రాజకీయ పార్టీలతో సంబంధంలేని లక్షమంది యువతను వివిధ రంగాలలో ఆవిష్కర్తలుగా, విధాన రూపకర్తలుగా; ఓపిక, సామర్థ్యంతో కష్టపడగలిగితే వాటిని అమలుచేసే నాయకులుగా తయారుచేసే ప్రయత్నమిది.

**వి.బి.వై.ఎల్.డి ప్రక్రియ**

వి.బి.వై.ఎల్.డిలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి జెన్‌జడ్ వయసువారి దరఖాస్తులను స్వీకరిస్తారు. వారిని నాలుగు దశల్లో వడపోస్తారు. మొదటి మూడు వడపోత కార్యక్రమాల్ని రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తారు, చివరి దశలో జాతీయస్థాయిలో పరీక్షిస్తారు. భారతదేశానికి సంబంధించిన క్విజ్‌లు, చర్చలు, ప్రసంగాలు, దేశ భవిష్యత్తుకి సంబంధించిన వ్యాసాల రూపంలో వారి ఆలోచనలను తీసుకుంటారు. చివరికి ఓ 3,000 మందిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. 2025 లో ఇలా వ్యాసరూపంలో వచ్చిన ఆలోచనల్లో కొన్నిటిని ఎంపిక చేసి జాతీయ యువజన విధానంలో భాగం చేశారు.

**వి.బి.వై.ఎల్.డి 2026**

2026లో మొత్తం దేశవ్యాప్తంగా 2 కోట్ల మంది యువత వి.బి.వై.ఎల్.డి ప్రకటనకు స్పందించారు. వారిలో 50 లక్షల మంది రిజిస్టర్ గావించుకున్నారు. ఈ మొత్తం నుండి దశలవారీగా 20,000 మందిని వడపోసి, చివరికి 3,000 మందిని ఎంపిక చేసి ఢిల్లీకి ఆహ్వానించారు. జనవరి 9 నుండి 12 వరకు జరిగిన కార్యక్రమంలో తొలుత దేశ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ వారినుద్దేశించి ప్రసంగించారు. జనవరి 12 యువజన దినోత్సవం రోజున ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిశానిర్దేశం చేయటంతోపాటు, ఎంపికైన యువత వ్యాసాల సంకలనాన్ని విడుదల చేశారు. భారత్‌కి రాబోయే పాతికేళ్లూ ఎంతో కీలకమని, ఈ సమయం జెన్ జడ్ కి కూడా ఎంతో కీలకమని, ఈ సువర్ణావకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రధాని

పేర్కొన్నారు. యువత ఒక థింక్ ట్యాంక్ గా రూపొంది.. ఆకాశమంత ఎత్తుగా, సముద్రమంత లోతుగా దేశ సమస్యలకి ఆచరణసాధ్య పరిష్కారాలపై మథనం చేయాలన్నారు. జాతీయస్థాయితో పాటు రాష్ట్రాల్లోనూ, ఆ తర్వాత జిల్లా స్థాయిలోనూ సమస్యల పరిష్కారానికి వేదికలను ఏర్పాటు చేసి యువత చర్చించాలన్నారు (ఈ సూచనను జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనబలం జనవరి 2026 సంచికలో కూడా ప్రస్తావించాం. కేవలం జిల్లా స్థాయికి కాకుండా, స్థానిక ప్రభుత్వాల స్థాయి వరకూ కార్యక్రమాన్ని విస్తరించాలని విజ్ఞప్తి చేశాం).

**సామాజిక పరిష్కారాల్లో హ్యాండ్స్ ఆన్ అనుభవానికి స్థానిక ప్రభుత్వాలు**

నిజానికి, వి.బి.వై.ఎల్.డి కార్యక్రమం దిగువ స్థాయి నుంచి నాయకత్వాన్ని పెంచినట్లు కనిపించినా ఆ స్ఫూర్తి ఇందులో అంతగా ప్రతిఫలించినట్లు భావించలేం. కాస్త వనరులు, వాటి ద్వారా మంచి చదువు అందినవారే పైస్థాయికి ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువ ఉంటాయి. ఢిల్లీ భారత్ మంటపంలో 2026 సమావేశం చూసినవారికి కూడా ఇదే అభిప్రాయం కలుగుతుంది. పరిజ్ఞానంతో, సంఘటితంగా స్థానిక స్థాయి నుంచి సమస్యల్ని పరిష్కరించే నాయకత్వాన్ని అందించే అవకాశం వస్తే అనేక మణిమాణిక్యాలు సామాన్య యువత నుంచి వెలుగులోకి వచ్చి ప్రకాశిస్తాయి.

హ్యాండ్స్ ఆన్ అనుభవం ఉపాధి అవకాశాలలో కీలకమంటూ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు, ఐటీఐ, పాలిటెక్నిక్ ల ఆధునీకరణ గురించి ప్రధాని ప్రస్తావించారు. అదే సూత్రం విధానాలు, సామాజిక పరిష్కారాల విషయంలోనూ వర్తిస్తుంది. క్షేత్రస్థాయి అనుభవంలేని నిపుణుల కంటే స్థానిక ప్రభుత్వాల నుండి వచ్చినవారుకొన్ని కీలకాంశాల్లో మెరుగైన సూచనలిచ్చే అవకాశాలుంటాయి.

పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రజాస్వామ్యానికి పాఠశాలలు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పార్టీ రాజకీయాలతో సంబంధంలేకుండా.. పాలన, ఆర్థిక వ్యవస్థ, చట్టబద్ధపాలన ఇలా అనేక అంశాల్లో యువత ఆరితేరతారు. మనిషి రాజకీయ జంతువు అని అరిస్టాటిల్ కాలంలోనే అన్నారుగానీ, రాజకీయం ఎలా పనిచేస్తుందో మనలో చాలా మందికి ఇప్పటికీ తెలియదు. స్థానిక ప్రభుత్వాల స్థాయి నుండి మాత్రమే అది సాధ్యమవుతుంది. అలా దిగువ స్థాయి పాలన నుండే జలగం వెంగళరావు లాంటి సమర్థ ముఖ్యమంత్రులు తయారవుతారు; సీవీ రామన్, నాయుడమ్మ, చంద్రశేఖర్ లాంటి శాస్త్రవేత్తలు, పలువురు టెక్నోక్రాట్లు తయారవుతారు.

**రాష్ట్రాల స్థాయిలోనే 63% నిధుల ఖర్చు..**

**చైనాలాంటి దేశంలో స్థానిక ప్రభుత్వాలకు 51% శాతం నిధులిస్తూ వాటి ద్వారా ఖర్చు చేస్తుంటే, మన దేశంలో ప్రపంచంలో ఎక్కడాలేని రీతిలో రాష్ట్రస్థాయిలో 63% నిధులిస్తూ, స్థానిక ప్రభుత్వాలకు కేవలం 3% ఇస్తున్నాం. అది కూడా ఎప్పుడిస్తారో తెలియకుండా, సర్పంచ్‌లు అప్పుల పాలయ్యేలా వాయిదాలతో ఎప్పటికో విడుదల చేస్తున్నారు.**

**జిల్లా యూనిట్ గా స్థానిక ప్రభుత్వాలకు సగం నిధులివ్వండి**

ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ 2008లోనే ఆవిష్కరించిన జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, స్థానిక ప్రభుత్వాలను వాటి పరిధిలోకి తేవాలి. ఈ మొత్తాన్నీ రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలతో అనుసంధానాన్ని చేయాలి. ఇప్పటికే ఎగుమతులకు 'జిల్లాకో ఉత్పత్తి' కార్యక్రమాన్ని యూనియన్ ప్రభుత్వం ప్రారంభించింది. మంచి ఫలితాలనిస్తోంది. ఇప్పుడు వికసిత భారత్ యువ డైలాగ్ కార్యక్రమాన్ని కూడా అలా స్థానిక సమస్యల నుండి జాతీయ స్థాయి వరకూ ఏర్పాటు చేస్తే, సమ్మిళిత మార్పు సాధ్యమవుతుంది. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో సంపదసృష్టికర్తలు కాగలుగుతారు.

గతం కంటే ప్రస్తుతం ఫెడరలిజం పరిణతి చెందినా, మూడో అంచెలో నిధులు, అధికారాలు దాదాపు లేవు. రాష్ట్రం ఉన్నకొద్దీ బలోపేతమవుతూ ఎమ్మెల్యేలు స్థానిక ప్రభుత్వాల అధికారాలను లాగేసుకుంటున్నారు. చైనాలాంటి దేశంలో స్థానిక ప్రభుత్వాలకు 51% శాతం నిధులిస్తూ వాటి ద్వారా ఖర్చు చేస్తుంటే, మన దేశంలో ప్రపంచంలో ఎక్కడాలేని రీతిలో రాష్ట్రస్థాయిలో 63% నిధులిస్తూ, స్థానిక ప్రభుత్వాలకు కేవలం 3% ఇస్తున్నాం. అది కూడా ఎప్పుడిస్తారో తెలియకుండా, సర్పంచ్‌లు అప్పుల పాల య్యేలా వాయిదాలతో ఎప్పటికో విడుదల చేస్తున్నారు. కాబట్టి వికసిత భారత్ యంగ్ డైలాగ్ లో ప్రధాని మోదీ చెప్పిన జిల్లా స్థాయి వేదికల ద్వారా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వాల సాధికారత, జిల్లా ప్రభుత్వాల ఏర్పాటుకు వినియోగించి, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే.. యువత, మహిళల సాధికారత భారత్ సాధికారతగా మారుతుంది. స్వదేశీ నినాదం వాస్తవమవుతుంది. ఎగుమతుల్లో మిగులు, సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతాయి.



# మహిళా సాధికారత సంస్కరణలకు మన సంకల్పమే అవరోధం?

**'సంకల్ప పరిమితం దృశ్యం.. ఓంకార పరివృత్తం విశ్వం'**

దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన లింగ సమానత్వంలో భారత్ ప్రపంచ సగటు కంటే కూడా వెనుకబడి ఉంది. జనాభా పరంగా మనతో పోల్చదగిన చైనాతోపాటు, మనం కంటే చాలా చిన్న దేశాలు కూడా ఈ విషయంలో ఎంతో ముందున్నాయి. లింగ సమానత్వంలో భారత్ గతం కంటే కొంత మెరుగుపడినా, మిగిలిన దేశాలు ఇంకా వేగంగా ఈ విభాగంలో అభివృద్ధిని సాధించటంతో భారత్ 2024 కంటే రెండు స్థానాలు దిగజారినట్లు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) 2025 సంవత్సర లింగ సమానత్వ సూచీ వెల్లడించింది. 2019లో కొవిడ్ నేపథ్యంలో అన్ని దేశాల్లో ఆర్థిక స్వావలంబనలో స్త్రీలు ఒడిదుడుకులకు గురయ్యారుగానీ, భారత్‌లో ఆ పరిస్థితి తీవ్రంగా ఉంది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరుగుతున్న దశలో మహమ్మారి రావటం, లాక్ డౌన్ అమలులో చాలా రాష్ట్రాలు ముందుచూపు లేకుండా ఏకపక్ష, అసమర్థ నిర్ణయాలు తీసుకోవటంతో.. దేశంలో 85% దాకా ఉన్న అసంఘటిత కార్మికులు, వారిలోనూ మహిళలు ఎక్కువ దుష్ప్రభావాలకి గురయ్యారు. ఆహార సరఫరా గొలుసులు దెబ్బతినటంతో.. ఇంటి నిర్వహణ, అందులో భాగంగా కుటుంబంలో పిల్లల ఆహార బాధ్యతల్ని మహిళలు ఎక్కువగా మోసే మనలాంటి సమాజంలో సామాన్య, రోజువారీ ఆదాయాల మహిళలు ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నారు. ఆ తర్వాత ఆర్థిక వ్యవస్థ క్రమంగా కోలుకోవటంతో మహిళల వాటా 19% నుండి 42% వరకూ పెరిగినట్లు చెబుతున్నారుగానీ, ఇంకా 30 లోపే ఆ శాతం ఉంటుందని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వంవారి గణాంకాలను యథాతథంగా ఆమోదించినా, పనిచేసే మహిళల్లో ఎక్కువమంది తక్కువ ఆదాయాన్నిచ్చే వ్యవసాయరంగానికే పరిమితమయ్యారు. కొవిడ్ లాక్ డౌన్ సమయంలో మండుటెండల్లో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా కిలోమీటర్ల మేర సొంతూళ్లకు సాగించిన నడక.. వారిని ఇప్పటికీ గ్రామాలనే నమ్ముకునేలా చేస్తున్నాయి.

ఇక పట్టణ ప్రాంతాల విషయానికొస్తే, ఇక్కడే నివాసముంటున్న మహిళల్లో అత్యధికులు చదువుకుంటున్నమాట వాస్తవం. ఐఐటీలు, స్టెమ్ కోర్సులు మగపిల్లల కోసమే అనే భ్రమను ఇటీవలికాలంలో అమ్మాయిలు ఛేదిస్తున్నారు. సూపర్ న్యూమరరీ సీట్ల ఏర్పాటు వంటి ప్రోత్సాహకాలతో ఐఐటీల్లో అమ్మాయిల శాతం 2024-25లో 22% దాకా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా.. బెంగళూరు, కోజికోడ్, ఇండోర్ ఐఐఎం వంటి వాటిల్లో అమ్మాయిలు 50% దాటిపోయారు. మెడిసిన్ విద్యలో

అయితే, అబ్బాయిలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన పరిస్థితి. చదువు వరకూ అమ్మాయిల పట్ల సమాజ దృక్పథంలో కొంత మార్పు వచ్చినా, ఆ తర్వాత ఉపాధి, వ్యాపార, వ్యవస్థాపక అంశాల దగ్గరికొచ్చేసరికి ఇంకా పురుషాధిక్య ప్రభావం కొనసాగుతోంది. ఉజ్వల భవిష్యత్తు ఉన్న కళాశాలల్లో చదువుకున్నా, నిర్ణయాధికార పదవుల్లో మహిళల పాత్ర ఇంకా తక్కువగానే ఉంటోంది. దానికితోడు, ఇంటి బాధ్యతలను సమన్వయం చేసుకోవటం తప్పటంలేదు. మన దేశ జనాభారీత్యా, ఇలా నైపుణ్యాలు, నాణ్యమైన ఆదాయా వకాశాలున్న అమ్మాయిలు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో కనిపిస్తున్నా.. ఎక్కువమంది బాలికలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, అక్కడ విద్య మరీ అధ్వాన్నంగా ఉండటం వల్ల నష్టపోతున్నారు. నైపుణ్యాలు, సరైన ఉపాధి అవకాశాలను ఎక్కువగా అందుకోలేకపోతున్నారు. స్కూల్ డ్రాపవుట్లు కూడా బాలికల్లోనే ఎక్కువగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణ మహిళా శ్రామిక భాగస్వామ్యం 28% కంటే తక్కువకే పరిమితమైందని 2023 నుండి లేబర్ ఫోర్స్ పీరియాడిక్ సర్వేలను చూస్తే అర్థమవుతుంది. ఇంతకు ముందు అనుకున్నట్లు, ఈ భాగస్వామ్యంలోనూ నాణ్యమైన ఆదాయం తక్కువ పనులే ఎక్కువ.

పనిచేసే మహిళల్లో ఎక్కువమంది వ్యవసాయాధారితంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం, పట్టణ ఉపాధిలో మహిళలకు నిర్ణయాధికార హోదాలు తక్కువగా ఉండటం, ఒకే పనిలోనూ వేతనాల్లో వివక్ష వంటి కారణాల వల్ల ఆర్థిక సాధికారత మహిళల్లో తక్కువ నమోదై మన దేశం లింగ సమానత్వ ర్యాంకుల్లో వెనుకబడింది.

ఇక మరో కారణం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, చేసే ఖర్చునూ అసబంద్ధంగా వినియోగించటం. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, జీవనశైలి వ్యాధులు ముదిరాక ఆరోగ్యశ్రీ, ఎన్.టి.ఆర్ వైద్యసేవ, ఆయుష్మాన్ భారత్ వంటి ఇన్సూరెన్స్ ఆధారిత పథకాలతో ఆపరేషన్లు, ఇతర ఖరీదైన వైద్య చికిత్సల్ని మొక్కుబడిగా అందిస్తున్నారు తప్ప.. వాటిని తేలిగ్గా నియంత్రించే, నిరోధించే ప్రాథమిక స్థాయి వైద్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. చికిత్స కంటే నివారణ మేలు అనే వైద్య శాస్త్ర ప్రాథమిక నియమాన్ని విస్మరిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ వంటి ఏర్పాట్లు లేకపోవటం వల్ల ఆరోగ్య సమస్యలు చెప్పుకోవటానికి సంకోచంతో మహిళలు ఎక్కువగా నష్టపోతున్నారు.


**మన దేశ లింగ సమానత్వ ర్యాంకుని తగ్గించిన మరో అంశం..రాజకీయ సాధికారత**

1952లో తొలి లోక్‌సభలో మహిళల ప్రాతినిధ్యం 4.41 శాతం ఉండగా, 2019 నాటికి కేవలం 14.36 శాతానికి పెరిగింది. మళ్లీ 2025కి 13.8 శాతానికి తగ్గింది. గత రెండేళ్లుగా ఈ పరిస్థితిలో ఏ మాత్రం మెరుగుదల లేదు. రాష్ట్ర అసెంబ్లీల్లో పరిస్థితి ఇంకా తీసికట్టుగా ఉంది. అదేవిధంగా, మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 6.5 శాతం నుండి 5.6 శాతానికి తగ్గింది. బ్రిటన్, అమెరికా వంటి దేశాలు కూడా చేయలేని రీతిలో మహిళలకు మనం స్వతంత్రం వచ్చినప్పటి నుండి ఓటు హక్కును ఇచ్చాం. అదేవిధంగా, ప్రజాస్వామ్యానికి మాతృకగా చెప్పే అమెరికాకు ఇంతవరకూ మహిళ అధ్యక్షురాలు కాలేకపోగా, మన దేశంలో ఆ సమస్య లేదు. కానీ సగటున చూస్తే మహిళలకు మనమిచ్చే ప్రాతినిధ్యం నామమాత్రం.

లింగ సమానత్వ అంతరాన్ని అంచనా వేసేందుకు నాలుగు అంశాల్ని డబ్ల్యూఈఎఫ్ ప్రాతిపదిక గావించుకుంది. **స్త్రీ, పురుషుల ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలు; విద్యాపరమైన స్థితిగతులు; ఆరోగ్య-జీవన పరిస్థితులు; రాజకీయ సాధికారత.** వీటిల్లో విద్యాసమానత్వంలోనే భారత్ అత్యధికంగా 97.1 శాతానికి చేరుకుంది. జనన సమయంలో లింగనిష్పత్తి కాస్త మెరుగుపడింది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ మొత్తంగా 00.3 పాయింట్లు మెరుగుపడింది. దేశంలోని మహిళల, పురుషుల ఆర్థిక భాగస్వామ్యం అదనంగా 00.9 పాయింట్ల మేర పెరిగి, మొత్తంగా 40.7 శాతం సమానత్వాన్ని సాధించింది. భారత్‌లోని వివిధ ఉపాధి కార్యకలాపాల్లో మహిళ, పురుష కార్మి

## లింగ సమానత్వ లక్ష్యం దారితప్పితే ప్రపంచానికి నష్టం : యూనిసెఫ్ హెచ్చరిక




లింగ సమానత్వం, బాలికలు, మహిళల సాధికారతపై దృష్టి సారించే 'సుస్థిర అభివృద్ధి లక్ష్యం 5 (ఎస్.డీ.జీ 5)'ను సాధించటంలో భారత్ సహా ప్రపంచం వెనుకబడి ఉందని, దాని పర్యవసానాలు 160 ట్రిలియన్ డాలర్ల మానవ మూలధన నష్టానికి దారితీయవచ్చని యూనిసెఫ్ హెచ్చరించింది. ఇది ప్రపంచ జీడీపీ కంటే రెండింతలు. భారత్ సహా అంతర్జాతీయంగా ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు రికార్డు స్థాయిలో జరుగుతున్నప్పటికీ, ఉన్నత తరతులకు వచ్చేసరికి ఈ సంఖ్య గణనీయంగా తగ్గుతోందని యూనిసెఫ్ భారత్ ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు. అంతకన్నా ముఖ్యంగా, పాఠశాల విద్యా ప్రమాణాలు అధ్వాన్నంగా ఉండటం బాలికల మేధో వికాసాన్ని దెబ్బ తీస్తోందని, ఈ వైఫల్యాన్ని భారత్ వేగంగా సరిచేసుకోవాలని వివిధ సర్వేలు, అధ్యయనాలు సూచిస్తున్నాయి.

కుల భాగస్వామ్యంలో పెద్దగా మార్పులు చోటుచేసుకోలేదు. **2024-25 మొత్తం 45.9 శాతంలోనే కొనసాగింది.**

భారత సేవల రంగం బలంగా ఉన్నప్పటికీ, ఎక్కువ ఆదాయాలనిచ్చే ఆ రంగంలో తక్కువ మంది మహిళలే (ఐటీ కొంత మినహాయింపు) ఉన్నారు. తక్కువ ఆదాయాల నిచ్చే వ్యవ సాయం, గ్రామీణ వృత్తుల్లోనే ఎక్కువగా ఉన్నారు. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ వివిధ ఇతర కారణాల వల్ల రాజకీయంగా అల్ల కల్లోలం కావచ్చుగానీ, తయారీరంగంలో, ముఖ్యంగా దుస్తుల తయారీలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి కల్పించింది. దీంతో లింగ సమానత్వంలో 24వ స్థానం సాధించింది. అభివృద్ధికి పర్యాయపదమైన పట్టణీ కరణలో కూడా బంగ్లాదేశ్ మనకంటే ముందుంది. విద్య, ఆర్థిక, ఆరోగ్య, రాజకీయ రంగాల్లో మన కంటే మహిళలకు ఎక్కువ అవకాశాల నివ్వటమే కాదు, అవి సాధికారతను పెంచేవిగా కూడా ఉండటం వల్ల 2024 కంటే 2025కి బంగ్లాదేశ్ ఏకంగా 75 స్థానాలు ఎగబాకి 24 వ ర్యాంకుకి చేరుకుంది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్ మొదటిస్థానంలో నిలువగా, భారత్ దిగువస్థానాల్లో ఉంది.

**భారత్ లో 2022-23లో వివిధ రంగాల్లో స్త్రీ, పురుష శ్రామికుల వాటా.. (శాతాల్లో)**

| విభాగం | పురుషులు | స్త్రీలు |
|---|---|---|
| కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కార్యకలాపాలు | 73.8 | 26.2 |
| ఉపకరణాలు, పరికరాల తయారీ | 96.2 | 3.8 |
| మోటారు వాహనాల తయారీ | 96.9 | 3.1 |
| సౌర శక్తితో విద్యుదుత్పత్తి | 83 | 17 |
| మోటార్ల నిర్వహణ మరమ్మతు | 99.4 | 0.6 |
| స్టోర్లలో ఆహార చిల్లర విక్రయాలు | 78.6 | 21.4 |
| వస్త్రాలు నేయటం | 57.2 | 42.8 |
| దుస్తులు, పాదరక్షలు వంటి విక్రయాలు | 84.2 | 15.8 |
| తృణధాన్యాల సాగు | 58.6 | 41.4 |
| పశువుల పెంపకం | 18 | 82 |

**(మూలం: నేషనల్ స్కిల్ గ్యాప్ స్టడీ ఫర్ హై గ్రోత్ సెక్టార్స్)**

**వరుసగా 16వ సారి ఐస్‌లాండ్ ఫస్ట్ ర్యాంక్**

2006 సంవత్సరం నుండి లింగ సమానత్వ ర్యాంకుల్ని ప్రకటిం చటం డబ్ల్యూఈఎఫ్ ప్రారంభించింది. ఈ జాబితాలో వరుసగా 16వ సారి ఐస్‌ల్యాండ్ 2025లో కూడా తొలిస్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో ఫిన్లాండ్, మూడులో నార్వే ఉన్నాయి. తాజా సర్వే 148 దేశాల మధ్య జరగ్గా.. భారత్ 131, మాల్దీవులు 138, శ్రీలంక 130, నేపాల్ 125, భూటాన్ 119, అట్టడుగున 148వ స్థానంలో పాకిస్థాన్ ఉన్నాయి.

భారత్ మహిళల పాత్రను కార్మిక శక్తిలో పెంచటంతోపాటు, వారి ఆర్థిక స్వావలంబనను, ఆదాయాల్ని, సాధికారతను పెంచే ఉపాధి అవకాశాల్ని వారికి కల్పించాలి. పోలీసు, సైనిక దళాల్లో సైతం మహిళల ప్రాతినిధ్యం అతి తక్కువగా ఉండటం చూస్తే.. లింగ వివక్ష కేవలం సామాజిక సమస్య కాదు, ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వ విధుల్లో మన రాజకీయ వ్యవస్థ వైఫల్యం కూడా పెద్దఎత్తున ఉందని అర్థమవుతుంది. వివిధ పోలీసు విభాగాల్లో ఉన్న మొత్తం 31 లక్షల మంది సిబ్బందిలో 10% కూడా స్త్రీలు లేరు. అదేవిధంగా, సైన్యంలో 2020లో 3.8% ఉండగా, 2024కి ఆ సంఖ్య కేవలం 4.1 శాతానికి పెరిగింది. ఇదేకాలంలో వాయుసేనలో మహిళల ప్రాతినిధ్యం 13.2% నుండి 13.4 శాతానికి పెరిగింది. నావికాదళంలో 5.5 నుండి 6.8 శాతానికి పెరిగినా, తీర రక్షక దళం, రక్షణ పరిశోధనా సంస్థల్లో వారి ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉంది. ఈ లోపాల్ని సరిచేసి కీలక రంగాల్లో, పదవుల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలి.

అదేవిధంగా, మహిళల భద్రత విషయంలో చట్టవైఫల్యం వారి ఉపాధి చొరవకు గండి కొడుతోంది. ప్రతి గంటకూ యాభై మంది మహిళలపై, అందులోనూ దళిత, అణగారిన వర్గాలపై అత్యాచారాలు జరుగుతున్నట్లు అంచనా. ఇక వేధింపులకు కొదవలేదు. చట్టబద్ధపాలన సక్రమంగా అమలు చేయటం, పోలీసు సిబ్బందిలో మహిళల ప్రాతినిధ్యం పెంచటం, లోక్ సత్తా కృషితో 2009లో వచ్చిన గ్రామ న్యాయాలయాల చట్టాన్ని విస్తరించి, ఖర్చు లేకుండా వారం, పది రోజుల్లోగా తీర్పుతో మహిళలపై నేరాలకు తొలిదశలోనే అడ్డుకట్టవేసేలా స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయటం అవసరం.

ఆర్థిక సాధికారతలో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు వ్యవసాయం నుండి ఉపాధిని పరిశ్రమలు, తయారీ రంగానికి, వ్యాపారాలకు మళ్లించేలా గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి.

మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను అమలు చేసేలా బిల్లు 30 ఏళ్ల తర్వాతైనా ఆమోదం పొందటం వల్ల రాజకీయాధికారంలో వారి ప్రాతినిధ్యం పెరగొచ్చుగానీ.. ఇప్పటికే మహిళలకు 50% రిజర్వేషన్లు అమలవుతున్న స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు నామమాత్రం కావటం వల్ల, పురుషాధిక్యత కొనసాగుతుండటం వల్ల చాలా గ్రామాల్లో మహిళా ప్రజాప్రతినిధులు సాధికారత లేకుండా ఉత్సవ విగ్రహాల్లా, పురుష కుటుంబ సభ్యుల నీడల్లా



కొనసాగుతున్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుంచి స్థానిక ప్రభుత్వాల విషయంలో చేస్తున్న ఈ పెద్ద తప్పిదాన్ని రాజ్యాంగం వచ్చి 75 ఏళ్లయినా సరిచేయటం మీద రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించటం లేదు. ఇదే సమయంలో, మహిళల ఆరోగ్య భద్రత కోసం ప్రాథమిక స్థాయి నుండి నాణ్యమైన ఆరోగ్యాన్నిచ్చి, ఎక్కువ ఉత్పాద కతతో ఆర్థికాభివృద్ధిలో మెరుగైన భాగస్వామ్యం సాధించేలా, జాతీయాదాయాన్ని పెంచగలిగేలా చిన్న పట్టణాల్లో, కనీసం అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున ఫ్యామిలీ డాక్టర్ల బృందం ఉండే ప్రాథమిక, నివారణ ఆరోగ్య సెంటర్లను ఏర్పాటు చేయాలి. ల్యాబ్ టెస్టుల్ని, జనరిక్ మందుల్ని ఉచితంగా అందించటంతోపాటు.. తమకు నమ్మకమున్న డాక్టర్ల సేవలను ఉపయోగించుకునే ఎంపిక స్వేచ్ఛ ప్రజలకు ఇవ్వాలి. అది కూడా నామమాత్రపు ఫీజుతో. మహిళల ఆరోగ్య రికార్డులను ప్రాథమిక స్థాయిలోనే భద్రపరచటం, ఆస్పత్రి చికిత్స అవసరమైతే.. ఎమర్జెన్సీ సందర్భం మిన హాయించి ఫ్యామిలీ డాక్టర్ ద్వారానే అనుసంధానం ఉండేలా ఏర్పాటు చేయాలి. మహిళ చదువు ఇంటికి ఎలా వెలుగవు తుందో, మహిళ ఆరోగ్యం కూడా ఇంటికి రక్ష అవుతుంది.

**లింగ సమానత్వంలో ప్రపంచ సగటు కన్నా భారత్ వెనుకబాటు**

లింగ సమానత్వంలో ప్రపంచ సగటు 2025లో 68.8%గా ఉంది. అంటే, ఆ మేరకు మాత్రమే వివక్ష తొలగింది. మిగిలింది తొలగాలంటే, ప్రస్తుత పరిస్థితుల్లో 123 ఏళ్లు పడుతుందని డబ్ల్యూఈఎఫ్ అంచనా వేసింది. భారత్ స్కోరు 64.4%. అంటే, సమానత్వానికి మన దేశానికి ఇంకా ఎక్కువ సమయం పడుతుంది. 2047 నాటికి వికసిత్ భారత్‌గా అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆశ పడుతున్నాం. కానీ అప్పటికి మనం ఏర్పరచుకున్న లింగ సమానత్వ లక్ష్యం ఎంతో తెలుసా? కేవలం 70%. లింగ సమానత్వ సూచీలో గత పదహారేళ్లుగా, అంటే 2009 నుండి అగ్రస్థానంలో ఉంటూ వస్తున్న ఐస్ ల్యాండ్ స్కోరు 2025లో 92.6% గా ఉంది. ఇప్పుడు ఐస్ ల్యాండ్ ఉన్న స్థాయిని మనం 2047 కి కూడా అందుకోవాలని కనీసం సంకల్పం కూడా చెప్పుకోలేకపోతున్నాం. పైనుంచి ఏ దేవుడో మార్చాల్సిన పరిస్థితి కాదు ఇది, మనకుగా మనం ఏర్పరచుకున్న మానసిక సంకుచితత్వం. మనం వేగంగా సంస్కరణల్ని అమలు చేస్తే, కొద్దికాలంలోనే ఈ లక్ష్యాన్ని సాధించగలం. మార్చి 8, 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం మనల్ని ఈ దిశగా ఆలోచింపచేయాలి.

**ఏఐ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యమే స్మార్ట్ పరిష్కారం**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరూ ఉన్నతాధికార బృందాలతో వెళ్లిన దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు అంచనా ప్రకారం రానున్న అయిదేళ్లలో ఏఐ వల్ల 22% ఉద్యోగాలు ప్రస్తుతం ఉన్న స్థితి నుండి మారిపోతాయి. 80 కోట్ల మంది కేవలం యువతకి ఉపాధిని అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒడిదుడుకులు పెరగకుండా, ఆర్థిక సుస్థిరతకు మహిళల అభివృద్ధి మీద దృష్టి సారించాలని డబ్ల్యూఈఎఫ్ ఇంజినీరింగ్ అండ్ కన్ స్ట్రక్షన్ ఇండస్ట్రీ గ్రూప్ చైర్ పర్సన్ ఎబ్రూ ఓజ్ డెమీర్ పేర్కొన్నారు. మనం సద్వినియోగం గావించుకోని గ్రోత్ ఇంజిన్ 'మహిళా ఆర్థిక వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. ఇందుకోసం అమ్మాయిలనుఎటువంటి లింగ వివక్ష లేకుండా 'స్టెమ్' సబ్జెక్టు రంగాల్లో చదివించాలన్నారు. సాంకేతికత పట్టభద్రులుగా, నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకునేవారుగా తయారు చేయాలని సూచించారు.దీంతోపాటు, ఇప్పటికే ఉపాధి కలాపాల్లో ఉన్న మహిళలకురీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ పట్ల ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే, ఏఐ విస్తరిస్తున్న కొద్దీ, ఆర్థిక అంతరాలు విపరీత మవుతాయన్నారు. హైటెక్ భవిష్యత్తు అంతరాల పునాది మీద నిర్మితం కాలేదని స్పష్టం చేశారు.సాంకేతికతలపై శిక్షణ, మెంటారింగ్ తో.. యువతులు డేటా, ఎథికల్ ఏఐ ఆడిటింగ్, గ్రీన్ టెక్నాలజీ వంటి నైపుణ్యాలతో వేగంగా నాణ్యమైన ఉపాధి అవకాశాలను అందుకోగలుగుతారన్నారు. డిజిటల్ సేవలు, గ్రీన్ ఎకానమీలో ఇబ్బడి ముబ్బడిగా అవకాశాలున్నాయని, ఇవి కాకుండా ఏఐ ఆధారిత తయారీ రంగంలోనూ విస్తృత అవకాశాలున్నాయన్నారు. ఒక్క అమెరికాలోనే 10 లక్షల గ్రీన్ ఎలక్ట్రీషియన్ల అవసరం ఉంటుందన్నారు. మహిళల పై పెట్టుబడి సామాజిక న్యాయం కోసం కన్నా.. సుస్థిర, పర్యావరణహిత, సురక్షిత ఆర్థికాభివృద్ధిలో భాగంగా ప్రపంచానికి అవసరమన్నారు.

# యూనియన్ నుంచి నామమాత్రం.. రాష్ట్రం నుంచి శూన్యం

# తెలంగాణ మునిసిపల్ కార్పొరేషన్లలో అభివృద్ధి అంతంతమాత్రం




ఇటీవల నాలుగేళ్ల వాయిదా తర్వాత బృహన్ ముంబయి మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలు జరిగినప్పుడు ఓ విశ్లేషకుడు లోక్‌సత్తా భావజాలాన్ని ప్రతిఫలిస్తూ ఫలితాల గురించి కన్నా మేయర్ అధికారాల గురించి మాట్లాడారు. న్యూయార్క్ మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ పోటీ చేస్తుంటే, ప్రపంచంలోనే అతిశక్తి మంతమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోటీగా భావించారని, మన దేశంలో ముంబయి లాంటి మహానగరం మేయర్‌ని ప్రధాని మోదీతో పోల్చటం అలా వుంచి, కనీసం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో కూడా పోల్చే సాహసం చేయలేక పోయారని వ్యాఖ్యానించారు. ముంబయి సంగతి అలావుంచితే, మన హైదరాబాద్ పరిస్థితీ అదే. రేపు అమరావతి తయారైతే, అక్కడా అంతా ముఖ్యమంత్రి గారే.

**ఎన్నికలకు ముందు హడావుడిగా రూ.2,355 కోట్లు**

పట్టణ స్థానిక ప్రభుత్వాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం హడావుడిగా ఇటీవల రూ.2,355 కోట్లు కేటాయించింది. జీహెచ్ఎంసీ మినహా రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక సంస్థల్లో అత్యవసర పనుల కోసం ఈ నిధుల్ని ఖర్చు చేయాలని ఆదేశించింది. పాత పనులకు సంబంధించిన బిల్లులే పెండింగ్‌లో ఉండటంతో కొత్తవాటిని చేపట్టటానికి ఎవరూ ముందుకు రాకపోవటంతో.. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిధుల్ని విడుదల చేసినట్లు చెబుతున్నారు. ఎన్ని విడుదలయ్యాయి, ఎక్కడ ఖర్చు చేస్తున్నారు, నాణ్యతా ప్రమాణాలకు జవాబుదారీ ఏర్పాట్లు ఏమిటి?.. మీడియా కూడా పట్టించుకోవటం లేదు. ప్రజలకు ఓటు విలువ అర్థమ య్యేంత వరకూ ఏలికల నుండి అధికారుల వరకూ ఈ బాధ్యతారాహిత్యాన్ని, తాత్కాలిక రాజకీయాల్ని భరించాల్సిందే.

మేయర్లు, మునిసిపల్ చైర్మన్ల సంగతి అలావుంచితే.. ఇప్పుడు పురపాలక ఎన్నికలు జరుగుతున్న తెలంగాణలోని నగర పాలక సంస్థల్లో రోజువారీ సౌకర్యాల అభివృద్ధి కూడా అంతంత మాత్రంగానే ఉంటోంది. సమకూరుతున్న ఆదాయంలో మూలధన వ్యయం కింద ప్రగతి పనులకు అతి తక్కువగా వెచ్చిస్తుండటమే ఇందుకు కారణమని రిజర్వు బ్యాంకు జాతీయస్థాయి అధ్యయనం ఇటీవల వెల్లడించింది.

2023-24లో అన్ని రాష్ట్రాల నగర పాలక సంస్థల మూలధన తలసరి వ్యయం జాతీయ సగటు రూ.11,532. ఈ విభాగంలో తొలి మూడు స్థానాల్లో మహారాష్ట్ర (రూ.33 వేలు), తమిళనాడు (రూ.13 వేలు), ఉత్తర్‌ప్రదేశ్ (రూ.12 వేలు) ఉన్నాయి. తెలంగాణ కేవలం రూ.6 వేల లోపు మూలధన తలసరి వ్యయంతో జాతీయ సగటు కన్నా చాలా వెనుకబడింది. రాష్ట్రాల వారీగా చూస్తే 14వ ర్యాంకులో ఉంది. బీహార్, జార్ఖండ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు సైతం తలసరి మూలధన వ్యయంలో తెలంగాణ కన్నా ముందుండటం గమనార్హం.

**జీతభత్యాలు, పింఛన్లు, అప్పుల చెల్లించటానికే..**

ఆదాయంలో అధికశాతం మునిసిపల్ ఉద్యోగుల జీత భత్యాలు, పింఛన్లు, అప్పులు చెల్లించటానికే పోతోంది. ఆదాయానికి తగినట్లుగా వంద శాతం వ్యయం కూడా పలు రాష్ట్రాలలో ఉండటం లేదు. తెలంగాణలోని అన్ని నగర పాలక సంస్థల రెవెన్యూ రాబడి 2018-24 మధ్య

### ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

మునిసిపల్ చైర్మన్, మేయర్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ చైర్మన్ల చాంబర్ ప్రభుత్వాన్ని కోరింది. నిధులు పూర్తిస్థాయిలో సకాలంలో విడుదల చేయాలని, దీనివల్ల విధులు సమర్థంగా నిర్వహించే అవకాశముంటుం దన్నారు.

అయిదేళ్ల కాలంలో రూ.3,638 కోట్ల నుంచి రూ.4,762 కోట్లకు చేరింది. అంటే ఆదాయం పెరుగుదలలో అయిదేళ్ల వ్యవధిలో 30.89% వృద్ధి నమోదైంది. కానీ, ఇదేకాలంలో నగర పాలక సంస్థల మొత్తం మూలధన వ్యయం రూ.4,725 కోట్లకు చేరింది. ఈ వ్యయంలో స్థిరాస్తుల కల్పనకు పెట్టింది చాలా తక్కువ. ఉదాహరణకు 2023-24లో తెలంగాణ లోని నగర పాలక సంస్థల మూలధన వ్యయం రూ.4,725 కోట్లుంటే, ఇందులో స్థిరాస్తుల కల్పనకు రూ.418 కోట్లు మాత్రమే వెచ్చించారు. రోడ్లు, వంతెనలకు ఇందులో వెచ్చించింది రూ.151 కోట్లు మాత్రమేనని ఆర్.బీ.ఐ వివరించింది. పాత బాకీలకు రూ.127.15 కోట్లు చెల్లించాయి.

- రెవెన్యూ వ్యయంలో అత్యధిక శాతం ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే వెచ్చిస్తున్నాయి. 2023-24లో తెలంగాణ నగర పాలక సంస్థల మొత్తం రెవెన్యూ వ్యయం రూ.3268.74 కోట్లు ఉంటే, ఇందులో జీతభత్యాలకు రూ.1433.26 కోట్లు, పింఛన్లకు రూ.180 కోట్లు, నిర్వహణ ఖర్చులకు రూ.911.44 కోట్లు ఖర్చు పెట్టాయి.
- గతంలో తీసుకున్న అప్పులపై వడ్డీల చెల్లింపులకి రూ.391.70 కోట్లు వెచ్చించాయి.

**ఆస్తి పన్ను ఆదాయమే దిక్కు**




నగర పాలక సంస్థలకు వస్తున్న ఆదాయంలో ఆస్తి పన్నుపై వచ్చేదే అధికంగా ఉం టోంది. 2019-20లో తెలం గాణలోని అన్ని నగర పాలక సంస్థలకు వచ్చిన రూ.3,638 కోట్ల ఆదాయంలో ఆస్తి పన్ను ద్వారా రూ.1800 కోట్లు సమకూరింది. 2023-24లో వచ్చిన రూ.4,762 కోట్ల ఆదాయంలో ఆస్తి పన్ను రూ.2,376 కోట్లుగా ఉంది.

**రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్లు శూన్యం**

ప్రజలు చెల్లించే పన్నులు, కొత్తగా తీసుకున్న అప్పులు మినహా గత అయిదేళ్లలో యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సాయం కింద గ్రాంట్ల పద్దులో తెలంగాణలోని నగర పాలక సంస్థలకు పెద్దగా నిధులేమీ రాలేదని రిజర్వు బ్యాంకు వివరించింది. గ్రాంటుగా 2020-21లో తెలంగాణ నగర పాలక సంస్థలకు రూ.408 కోట్లు అందగా, 2023-24లో రూ.370 కోట్లే వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంటు పద్దు కింద ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు గ్రాంటు కింద నగర పాలక సంస్థలకు కొంతమేర నిధులిస్తున్నాయి. కేరళ మాత్రం రాజ్యాంగ స్ఫూర్తిని కొంతమేర అమలు చేస్తూ స్థానిక ప్రభుత్వాలకు నిబంధనల ప్రకారం నిధుల్నిస్తోంది, అధికారాల్ని బదిలీ చేసింది. ✦

### పట్టణ స్థానిక సంస్థలూ పార్లమెంటులా పనిచేయాలి

పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్ బీలు) కూడా పార్లమెంటు తరహాలో పనిచేసి, పౌర సమస్యలను పరిష్కరించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అభిప్రాయపడ్డారు. వాటి సర్వసభ్య సమావేశాల్లోనూ ప్రశ్నోత్తరాలు, శూన్య గంట ఉండాలని సూచించారు. బడ్జెట్ కు ఆమోదం తెలపటం వంటి కీలకాంశా ల్లోనూ ఎలాంటి చర్చా లేకుండా స్థానిక సంస్థల సమావేశాల్లో గందరగోళం నెలకొనటం బాధాకర మన్నారు. పాత పద్ధతుల్ని విడనాడి చట్టసభల్లో అవాంతరాల్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. సభా కార్యక్రమాలను అడ్డుకునే రాజకీయ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని ఓం బిర్లా ఇటీవల యూఎల్‌బీల జాతీయ సదస్సులో మాట్లాడుతూ అన్నారు. సభ జరిగితేనే ప్రజా సమస్యల్ని ప్రభావ వంతంగా ప్రస్తావించవచ్చన్నారు. ప్రజాస్వామ్య సంస్థలను జవాబుదారీగా నిలబెట్టటానికి సభలు సజావుగా సాగాల్సిన అవసరముందన్నారు. పట్టణ స్థానిక సంస్థలు 8 గంటల పాటు సమావేశాల్ని కొనసాగించాలన్నారు. యూఎల్‌బీల నుంచి దేశ నేతలు ఆవిర్భవిస్తారనటానికి సర్దార్ పటేల్ ఒక ఉదాహరణ అన్నారు.

# సమాజహితమే ఎన్.టి.ఆర్ నిజమైన ఆస్తి

## -డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



ఆర్థిక సంస్కరణలు అన్న మాటలేని రోజునే వాటిని అమలు చేసి విదేశాల నుండి పెట్టుబడులను, నైపుణ్యాలను తీసు కొచ్చిన ఘనత ఎన్.టి రామారావుదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఓపక్క పేదలకు తాత్కాలిక ఉప శమనంగా సంక్షేమాన్ని ఇస్తూనే, మరోపక్క అభివృద్ధికి పెద్దపీట వేసిన నేత ఎన్.టి.ఆర్ అన్నారు. రాజకీయాల్ని సామాన్యుల్లోకి తీసుకెళ్లి మాస్ పాలిటిక్స్‌ని భారత్‌లో పెద్దఎత్తున ప్రారంభిం చటం, మహిళల్ని ఉద్దేశించి ప్రత్యేకంగా మాట్లాడటం, వారి కోసం ఆస్తి హక్కు సహా వివిధ నిర్మాణాత్మక కార్యక్రమాలను అమలు చేయటం వంటివి ఇప్పటికీ దేశంలో ఆధునిక రాజకీయమన్నారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గుత్తాధి పత్యానికి నిజమైన ప్రత్యామ్నాయం రామారావుతోనే ప్రారంభమైందన్నారు. ప్రజాధనం ప్రతి రూపాయినీ సొంత సొమ్ముకంటే పొదుపుగా ఖర్చు పెట్టి, సంక్షేమ పథకాల ద్వారా కూడా ప్రజలకు స్వావలంబన లభించాలని వాటిని ఉత్పాద కంగా అమలు చేశారన్నారు. ఈవేళ మంత్రులు, ముఖ్య మంత్రులు, జాతీయ నేతలుగా ఉన్నవారిని అతి తక్కువ ఖర్చుతో గెలిపించిన ఘనత రామారావుదన్నారు. నేటి రాజకీయ నేతలు ఎన్.టి.ఆర్ కి దండలు వేసి దండాలు పెట్టటంతో సరి పెట్టకుండా.. ప్రజల పట్ల ఆయనలా ప్రేమతో రాజకీయం, పాలన చేయా లన్నారు.

ఒంగోలు పీవీఆర్ మునిసిపల్ మైదానంలో జరుగుతున్న ఎన్.టి.ఆర్ కళాపరిషత్ నాట కోత్సవాలలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక మనిషికి గొప్పతనం డబ్బు, కులం, మతం, ప్రాంతం, భాషను బట్టి రావని.. అతను లేదా ఆమె వల్ల సమాజానికి ఎంత మంచి జరిగింది అన్నదే ఆ పౌరుని గొప్పతనానికి గీటురాయి అని తెలిపారు. ఐఏఎస్ కెరీర్ లో ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా చెరగని ముద్ర వేసిన జేపీ..ప్రస్తుత రాజకీయాల్ని, నేతల్ని ఎన్.టి.ఆర్ హయాంతో పోలుస్తూ వివరించిన తీరు పలు వురిని ఆకట్టుకుంది. తొలుత ఏల్చూరి హనుమంతరావు, శ్రీ భారతి నాదస్వర ప్రదర్శన గావించారు. జానపద, భక్తిరస పాటలకు మారెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోలాట నృత్యాలు చేశారు. విజయవాడ న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ ఆర్ట్స్ వెల్ఫేర్ వారు 'కపిరాజు', సహృదయ, ద్రోణా దులవారి వర్క్ ఫ్రం హోమ్ సాంఘిక నాటికలు ప్రేక్షకులను ఆలోచింప చేశాయి. లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ తదితర నేతలు పాల్గొన్నారు. ✦

# బహుముఖ నైపుణ్యాలతోనే అవకాశాలు

విద్యకు కొలమానం నైపుణ్యం తప్ప ర్యాంకులకు కాదని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. నిజమైన పరిజ్ఞానం ఉంటే పరీక్షల్లో మార్కులు పెద్ద సమస్య కాదన్నారు. ఒత్తిడి లేకుండానే సంపాదించవచ్చున్నారు. మార్కెట్‌లో అవకాశాలు సర్టిఫికెట్లతో రావని, బహుముఖ నైపుణ్యాలతోనే వస్తాయని తెలిపారు. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరులో కిరణ్ జ్యోతి రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువతా మేలుకో' కార్యక్రమంలో జేపీ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఫౌండేషన్ ట్రస్టీ కందేపు రాజశేఖర్ అధ్యక్షత వహించారు.

జేపీ మాట్లాడుతూ.. సమాజంలో గొప్పవారిని ఆరాధించ నక్కర్లేదని, వారి నుంచి స్ఫూర్తిని మాత్రం పొందాలని సూచిం చారు. మనిషి మస్తిష్క పేటికలో మంచి ఆలోచనలు నాటుకునేలా సరైన మార్గాల్ని అందించటం సమాజం, రాజ్యం, మీడియా బాధ్యతలన్నారు. సమాజహితం అంటే మనల్ని మనం కాపాడుకోవటమేనన్నారు. ఈవేళ్టి అవసరాలు ముఖ్యమని, కానీ వాటి కోసమే బతికితే భవిష్యత్తు ఉండ దన్నారు. ప్రతి ఒక్కరికీ దీర్ఘకాలిక దృక్పథం ఉండాలన్నారు. సరైన ఆలోచనలు, ప్రశ్నలు చర్చించి పరిష్కారంలో భాగమయ్యేవారిదే భవిష్యత్తు అన్నారు. ప్రతి ఒక్కరిలో అపారమైన ప్రతిభ దాగివుంటుందని.. నిరంతర అధ్యయనం, పరిశోధనతో ఉత్తమ పౌరులుగా ఎదగ వచ్చున్నారు. స్వగ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న రాజశేఖర్‌ని అభినందించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ, చదువు, కెరీర్‌తో పాటు చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యల్ని పట్టించుకుంటే ఎలా ప్రయోజకులవుతారో జేపీ వివరించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, ఎస్.వి ఆయుర్వేద కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పరాశరం మురళీకృష్ణ, డాక్టర్ ఈదుపుగంటి హృదయనాథ్, జి.ఉమారావు, పి.వి శ్రీనివాసులు, సర్పంచ్ సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ✦

# పెరుగుతున్న గిగ్, ప్లాట్ ఫాం కార్మికులు.. సంక్షేమంపై ప్రభుత్వాలు చర్యలు అంతంతే

భారత్‌లో పనిచేసేవారిలో 80-90% అసంఘటిత రంగంలో ఉండటం కేవలం ఆర్థికంగానే కాకుండా సామాజిక రంగంలోనూ సమస్యలను సృష్టిస్తోంది. వీరిలోనూ ఇటీవలికాలంలో పెరిగిపోతున్న గిగ్ వర్కర్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. 2030 నాటికి గిగ్ వర్క్ సంస్కృతి భారత్ లో గణనీయంగా పెరుగుతుందన్న అంచనా నేపథ్యంలో.. గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లపై విజన్ -- 2047 పేరుతో ఇటీవల ఓ అధ్యయనం విడుదలైంది. ఈ కార్మికులందరికీ వివక్ష లేకుండా సమాన వేతనం, పనిగంటలు కల్పించాలని సూచించింది. కనీస గ్యారంటీ వేతనం అందించాలని.. జీవనవ్యయం, ద్రవ్యోల్బణం మేరకు దాన్ని సవరించాలని పేర్కొంది. వీవీ గిరి జాతీయ లేబర్ ఇన్‌స్టిట్యూట్ ఈ నివేదికను రూపొందించింది. ముఖ్యాంశాలు:

⏭ 2030 నాటికి గిగ్ రంగంలో ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున పెరుగుతాయి. 2047 నాటికి ప్రపంచంలో అత్యధిక వర్కర్లు భారత్‌లోనే ఉంటారు.

⏭ దేశంలోని 82.5% మంది గిగ్ వర్కర్లు అసంఘటితంగానే ఉన్నారు. ఈ రంగంలో రవాణా, ఆహార సరఫరా నుంచి మొదలైన సేవలు.. ఆరోగ్యం, విద్య తదితర రంగాలకు విస్తరించాయి.

⏭ పలు సంస్థలు మహిళలను గిగ్ ఉపాధిలో ప్రోత్సహిస్తున్నాయి. అయితే పురుషులతో పోలిస్తే మహిళలు పొందుతున్న ఆదాయం తక్కువ.

⏭ సంప్రదాయ ఉద్యోగాలతో పోలిస్తే.. ఈ రంగంలో మహిళలు, యువత ఉపాధిపరమైన ప్రోత్సాహకాలు అందుకోలేకపోతున్నారు.

⏭ గిగ్ రంగంలో ఉద్యోగ భద్రత లేకపోవటం అతిపెద్ద సవాలు. సుదీర్ఘకాలం ఉపాధి కల్పించే అవకాశాలు లేకపోవటం, డిమాండ్ ఆధారంగా పని, ఉద్యోగాల్లో తీవ్ర అస్థిరత, కార్మికుల హక్కులు, సామాజిక భద్రత లేకపోవటం సమస్యలుగా ఉన్నాయి. సామాజిక భద్రత, ఆరోగ్య బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు లేకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు తప్పటం లేదు.

⏭ ప్రాథమిక విద్య పూర్తిచేసిన వారితోపాటు ఉన్నత విద్యావంతులు కూడా గిగ్ వర్కర్లుగా పనిచేసేందుకు ముందుకొస్తున్నారు. ఈ వృత్తిలో ఎక్కువగా 18-45 ఏళ్లవారే ఉన్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లోనే వీరి సంఖ్య ఎక్కువగా ఉంది.




**సిఫార్సులు**

⏭ గిగ్ వర్కర్లందరికీ సమాన పనిగంటలు కల్పించాలి. కార్మికుల్లో 60% మంది వారానికి 7 రోజులు.. రోజుకి 12 గంటలు పనిచేస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారు. వారికి సామాజిక భద్రత పథకాలు చేరువ చేయాలి.

⏭ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్లాట్ ఫాం కంపెనీలు.. కార్మికులు, రెగ్యులేటర్లకు ప్రోత్సాహకాలు అందించాలి.

⏭ కార్మికులకు ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన కల్పించటం ద్వారా దీర్ఘకాలిక లక్ష్యాలతో పొదుపు చేయించాలి. గిగ్ వర్కర్లు తాము పూర్తి చేసిన లావాదేవీలు, జరిగిన చెల్లింపుల వివరాలన్నీ తెలుసుకునే అవకాశమివ్వాలి. కార్మికుల సమస్యలు, ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

⏭ గిగ్ వర్కర్లకు ప్రమాద, ఆరోగ్య పథకాల అమలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

**తెలంగాణలో గిగ్ వర్కర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు**

రాష్ట్రంలో గిగ్ వర్కర్లను గుర్తించటంతోపాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయనుంది. కార్మికులకు ఉద్యోగ భద్రత, రక్షణ, సామాజిక భద్రత కల్పించేందుకు తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) బిల్లు - 2025కు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. తెలంగాణలో పనిచేస్తున్న దాదాపు 4 లక్షల మంది గిగ్ వర్కర్లకు బోర్డు విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయటంతోపాటు వారి

# ప్రమాదకర పరిస్థితుల్లో గిగ్!

**ప్రతి రోజూ భారత రోడ్ల మీద జరిగే ప్రమాదాల కారణంగా 9 మంది బైక్ రైడర్స్ చనిపోతున్నారు. ఇందులో డెలివరీ వర్కర్లు మరింత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారు. దేశంలోని గిగ్ వర్కర్లలో సగం మంది చిల్లర వర్తకం, రవాణాల్లోనే ఉండటం గమనార్హం.**




| 2020-21 | 2029-30 | 2025లో | 2034 |
|---|---|---|---|
| నాటికి ఇండియాలో గిగ్ వర్కర్లు | వరకు పెరగనున్న సంఖ్య (నీతి ఆయోగ్ అంచనా) | ప్రపంచ గిగ్ ఆర్థిక వ్యవస్థ విలువ | నాటికి దీని విలువ (అంచనా) |
| 77 లక్షలు | 2.35 కోట్లు | 582 బిలియన్ డాలర్లు | 2.17 ట్రిలియన్ డాలర్లు |

సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయనుంది. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్ల బిల్లు పేరును..తెలంగాణ ప్లాట్ ఫాం ఆధారిత గిగ్ వర్కర్ల బిల్లుగా మార్చింది. ముసాయిదా బిల్లుని ప్రభుత్వం ఏప్రిల్ 14న ప్రకటించింది. మే 19 వరకు ప్రజలు, అగ్రిగేటర్లు, గిగ్ వర్కర్ల సూచనలు, సలహాలు స్వీకరించింది. గడువులోగా వచ్చిన 66 సూచనలను అధికారులతో కూడిన కమిటీ సమీక్షించింది. కమిటీ సూచనల మేరకు ముసాయిదాలో మార్పులు, చేర్పులు చేసిన కార్మిక శాఖ తుది బిల్లును మంత్రిమండలి ఆమోదించింది.

**కార్మిక మంత్రి చైర్మన్‌గా బోర్డు**

ప్రత్యేక బోర్డుకి చైర్మన్ గా రాష్ట్ర కార్మిక మంత్రి, యూనియన్ కార్మిక మంత్రి త్వ శాఖ ప్రతినిధి, కార్మిక, ఐటీ, ఆర్థిక, వాణిజ్య పన్నులు, రవాణా శాఖాధిపతులు, కార్మిక శాఖ కమిషనర్, బోర్డు సీఈఓ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. గిగ్ వర్కర్ల నుండి నలుగురు, అగ్రిగేటర్ల నుండి నలుగురు, వీరి కోసం పనిచేస్తున్న పౌర సంఘాల నుంచి ఇద్దరు చొప్పున సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. వీరిలో ఒక మహిళ కూడా ప్రాతినిధ్యం వహించాలి. ఐటీ సాంకేతిక నిపు ణుడు ప్రత్యేక ఆహ్వానితుడుగా ఉంటారు. సభ్యుల పదవీకాలం మూడేళ్లు.

**బోర్డు వద్ద కార్మికుల పేర్లు నమోదు చేసుకోవాలి**

అగ్రిగేటర్లు, గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లు ఈ చట్టానికి లోబడి బోర్డు వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలి. గిగ్ వర్కర్లు సంక్షేమ బోర్డు వద్ద పేర్లు నమోదు గావించుకునేందుకు సెల్ఫ్ రిజిస్టర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానుంది. చట్టం అమల్లోకి వచ్చిన 45 రోజుల్లోగా వర్కర్లు నమోదు చేసుకోవాలి. ఈ వివరాలను సంక్షేమ బోర్డు వెబ్ పోర్టల్ లో పొందుపరుస్తుంది. అగ్రిగేటర్లు 60 రోజుల్లో నమోదైన గిగ్ వర్కర్ల డేటాను బోర్డుకు ఇవ్వాలి. ప్రతి మూడు నెలలకోసారి తమ వద్ద నమోదైన వర్కర్ల వివరాల్లో మార్పులు, చేర్పులను బోర్డుకు అందచేయాలి.

**సంక్షేమం కోసం ప్రత్యేక నిధి**

సామాజిక భద్రత, బీమా పథకాల కోసం ప్రభుత్వం సంక్షేమ నిధిని ఏర్పాటు చేయనుంది. తెలంగాణ గిగ్, ప్లాట్ ఫాం వర్కర్ల సంక్షేమ నిధికి అగ్రిగేటర్లు గిగ్ వర్కర్‌కు ప్రతి లావాదేవీకి చేసే చెల్లింపుల్లో 1 శాతానికి తక్కువ కాకుండా, 2 శాతానికి మించకుండా జమ చేయాలి. ఈ నిధి ద్వారా బీమా, సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు, పింఛన్లు, ప్రసూతి సహాయం బోర్డు అందిస్తుంది. గిగ్, ప్లాట్ ఫాం వర్కర్లను సమగ్ర దర్యాప్తు చేయకుండా, వారం రోజుల ముందస్తు నోటీసు లేకుండా తొలగించరాదు. వినియోగదారులను భౌతిక, మానసిక వేధింపులకు గురిచేసినట్లు గుర్తిస్తే వారిని తొలగించే అధికారం కల్పించింది. ఈ చట్టం కింద పేర్లు నమోదు చేసుకున్న గిగ్ వర్కర్లు వెబ్ పోర్టల్ లేదా వివిధ పద్ధతుల్లో నియమితులైన ప్రత్యేక అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.


# 2007 చైనా = 2025-26 భారత్

ప్రపంచీకరణ వాణిజ్యంలో ఒడిదుడుకులు, కొన్ని ఇతరత్రా కారణాల వల్ల భారతదేశ ఆర్థిక భవిష్యత్తు మీద అంచనాల్ని వివిధ రేటింగ్ సంస్థలు తరచూ మారుస్తున్న నేపథ్యంలో.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్.బీ.ఐ) ఒక ఆసక్తికర పరిశోధనా నివేదికను వెలువరించింది.

మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారటానికి 2047ను గడువుగా, ఆ లక్ష్యాన్ని 'వికసిత్ భారత్'గా, ఈ లోగా కాలవ్యవధిని 'అమృతకాలం'గా ప్రకటించుకుని కార్యాచరణ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భారత్ వృద్ధిరేటు వేగం, ప్రపంచ వాణిజ్య విస్తరణలో భారత్ వాటా పెరగటం, జీడీపీలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానంలోకి రావటం, అంతర్జాతీయంగా భారత్ పలుకుబడి పెరగటం వరకూ వాస్తవం. ఇందుకు క్రియాశీల జనాభా రీత్యా భారత్ కున్న సువిశాల మార్కెట్ పెద్ద కారణం. అయితే జీడీపీలో రికార్డుకి కారణమైన ఇదే జన సంఖ్య.. భారత్ అభివృద్ధి చెందిన దేశం కావటానికి అవసరమైన తలసరి ఆదాయం విషయంలో ప్రతిబంధకమవుతుందా? ఈ సందేహం చుట్టూ వివిధ ప్రతిష్టాత్మక సంస్థలు అనుసరిస్తున్న అంచనా పద్ధతులు కొంత భిన్నంగా ఉండి గణాంకాలు కొంత అటూ ఇటూ అవుతున్నా.. అంతిమ పరిష్కారాలు మాత్రం ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నవే అయినందున, ప్రతి నివేదికనూ వివిధ రూపాల్లో 'జనబలం'లో అందిస్తూ వస్తున్నాం. వికసిత్ భారత్ లక్ష్యసాధన పట్ల మన వంతు బాధ్యతల నిర్వహణకు అవసరమైన అవగాహన పెంచటానికి ఈ చర్చలు దోహద పడతాయి. తాజాగా వెలువడిన ఎస్.బీ.ఐ నివేదిక భారత్, చైనాల మధ్య సంవత్సరాలు, ఇతరత్రా గణాంకాల మధ్య ఆసక్తికర సారూప్యం ద్వారా భారత్ ఆర్థిక వృద్ధిని అంచనా వేసింది.

**నాటి చైనా స్థాయి, పరిస్థితుల్లో నేటి భారత్**

భారత్ ప్రస్తుత తలసరి ఆదాయం సుమారు 2,580 డాలర్లు. 2007లో చైనా ఆదాయం కూడా అదే దరిదాపుల్లో 2,555 డాలర్లుగా ఉండేది. అంతేకాదు, అప్పట్లో చైనాలో ఉన్న పరిస్థితులే ఇప్పుడు భారత్‌లో కనిపిస్తున్నాయి. 2007కి, 2026కి మధ్య కాలవ్యవధి సుమారు 20 ఏళ్లు కాగా, భారత్ లక్ష్యసాధనకు సుమారు 23 ఏళ్ల వ్యవధి ఉంది.




చైనా ఆర్థిక వ్యవస్థ 2007 నుండి వేగంగా అభివృద్ధిని సాధించింది. 2010 నాటికి ఎగువ మధ్యాదాయ దేశంగా మారింది. భారత్ కూడా ఇప్పుడున్న అంచనాల ప్రకారం, 2030 నాటికి ఎగువ మధ్యాదాయ దేశంగా మారనుంది. ప్రపంచ బ్యాంకు నిర్వచనం ప్రకారం, తలసరి ఆదాయం 4,500 డాలర్లు దాటితే ఎగువ మధ్యాదాయ దేశంగా పరిగణిస్తారు. భారత్ నాలుగైదేళ్లలో ఆ స్థాయిని కచ్చితంగా అందుకుంటుందని ఎస్.బీ.ఐ చెబుతోంది.

అదేవిధంగా, చైనా కంటే ఆలస్యంగా ప్రారంభమైనా, చైనా తరహాలో వరుసగా కొన్నేళ్లపాటు ఆర్థికాభివృద్ధిని సాధించిన, మరో రెండు దశాబ్దాలపాటు కొనసాగించగల అవకాశాలు భారత్‌కి ఉన్నాయి.

**ఒడిదుడుకుల్ని చైనా అధిగమించిన తీరు**

ఈ పోలికను అర్థం చేసుకోవాలంటే, ఒడిదుడుకుల్ని చైనా అధిగమించిన తీరుని ఒకింత పరిశీలించాలి.

మావో తర్వాత వచ్చిన డెంగ్ జియావో పెంగ్ సింగపూర్ నమూనాను అనుసరించి రాజకీయాన్ని, ఆర్థిక వ్యవస్థను వేరు చేశారు. వాణిజ్యానికి అనువైన వాతావరణం కోసం ప్రత్యేక ఆర్థిక మండళ్లను ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ నిర్ణయాలు తీసుకోవటానికి, సమర్థంగా అమలు చేయటానికి వీలుగా అధికారాన్ని వికేంద్రీకరించి స్థానిక ప్రభుత్వాలకు సగానికిపైగా బడ్జెట్‌ను కేటాయించారు. గ్రామాల మధ్య పట్టణ ఎంటర్ ప్రైజ్‌ల సంస్కృతిని ప్రోత్సహించారు. ఈ టీవీఈలలో ఉపాధి అవకాశాలను అందుకోవటానికి వీలుగా పాఠశాల స్థాయి వరకూ అత్యున్నత ప్రమాణాల విద్యను అందించారు. రాజకీయంగా నిరంకుశత్వాన్ని కొనసాగిస్తూనే, మిగిలిన అన్ని రంగాలు, విభాగాల్లో సమ్మిళిత అభివృద్ధికి కావలసిన సంస్కరణల్ని అద్భుతంగా అమలు చేశారు. చైనా సంస్కృతిలో భాగమైన 'థింక్ బిగ్', కష్టపడి పనిచేయటాల్ని ఒడుపుగా ఉపయోగించుకుంటూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ సరకుల్ని వెల్లువలా ఉత్పత్తి చేయించారు.

మార్కెట్‌లను విస్తరించేందుకు, సొంత ఆస్తుల్ని కలిగి వుండేందుకు ప్రజలను ప్రోత్సహించారు. దీంతో 1978లో 150-200 డాలర్లున్న చైనా తలసరి ఆదాయం.. 1990 నాటికి 350 డాలర్లకు, 2000 సంవత్సరం నాటికి 950 డాలర్లకు చేరింది.

ఆ తర్వాత ఆర్థిక సంస్కరణలపై ఇక వెనక్కి మళ్లేదిలేదని డెంగ్ జియావో పెంగ్ తేల్చిచెప్పి వ్యవస్థీకృతం చేశారు. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా చేరింది. సరకుల రవాణాకు పోర్టుల్ని భారీగా విస్తరించారు. ఎంత భారీగా అంటే.. చైనాలోని ఓ నౌకాశ్రయం భారత్ లోని అన్ని పోర్టుల కంటే పెద్దదిగా ఉంటుంది. ప్రపంచీకరణను పూర్తిగా సద్వినియోగం గావించుకుంటూ, అమెరికా సహా వివిధ దేశాల సాంకేతికతలను సంగ్రహిస్తూ, అంతర్జాతీయ మార్కెట్లను చైనా సరకులు ముంచెత్తసాగాయి. ప్రపంచ తయారీకేంద్రంగా చైనా రూపుదిద్దుకునే క్రమంలో.. వ్యవసాయరంగం నుండి పలువురిని ఉత్పత్తిరంగంలో ఉపాధికి మళ్లించారు. ఈ రకంగా, 2007 వచ్చే సరికి చైనీయుల తలసరి ఆదాయం 2,550 డాలర్లకు చేరింది. 2008లో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఆర్థిక మాంద్యం వచ్చినా చైనా పరుగు ఆగలేదు. రహదారులు, హైస్పీడ్ రైలు తదితర మౌలిక సదుపాయాలతోపాటు.. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలను నెలకొల్పింది. దీంతో, ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా.. నాలుగు దశాబ్దాలకాలంలో 80 కోట్ల మందిని దుర్భర దారిద్ర్యం నుండి చైనా బయటపడేసింది. ఐక్యరాజ్యసమితి ఎస్.డీ.జీ-1 లక్ష్యాన్ని నిర్దేశిత 2030 కంటే ముందే, 2020లోనే సాధించింది. 2016లో డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడయ్యాక, అంతకుముందు కుదుర్చుకున్న ప్యారిస్ ఒప్పందాన్ని తిరస్కరించి, వాతావరణ మార్పుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించటంతో నెలకొన్న స్తబ్దతను చైనా పూర్తిగా సద్వినియోగం గావించుకుంది. తమ దేశంలోని పారిశ్రామిక కాలుష్య నగరాలను స్వచ్ఛీకరించు కోవటంతో పాటు, రాబోయే పర్యావరణ ఆర్థిక వ్యవస్థకు తగ్గ సాంకేతి కతను, విద్యుదుత్పత్తిని సమకూర్చుకుంది. ఈవేళ అమెరికా సహా ప్రపంచమంతా అవాక్కయ్యేలా చైనా విజయాల్ని, మిగులు వనరుల్ని సాధించింది. 2007లో చైనాతో పోలికలున్నంత మాత్రాన భారత్ ఈ రకమైన వ్యవస్థీకృత ఆర్థిక నిర్మాణం, స్థాయి సాధించగలుగుతుందా?ప్రశ్నే

చైనా కంటే పుష్కరకాలం ఆలస్యంగా ప్రారంభించటంతో పాటు విధిలేని పరిస్థితుల్లోనే భారత్ ఆర్థిక సంస్కరణల్ని చేపట్టిందనేది వాస్తవం. అయితే అప్పట్నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఆ సంస్కరణల్ని కొనసాగించటం, పెట్టుబడుల్ని ఆకర్షించటం నిరాటంకంగా సాగుతోంది. పెట్టుబడుల్ని పెద్దఎత్తున ఆకర్షించటం కొనసాగించారు. దీనివల్ల చైనా తరహాలో గత రెండు దశాబ్దాలుగా భారత్ వేగంగా అభివృద్ధిని సాధించింది. మధ్యలో పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్), కొవిడ్ అవాంతరాలు వచ్చినా ఈ ఇరవయ్యేళ్లూ 7-8% సగటు వృద్ధి నమోదైందని అంచనా. వచ్చే 23 ఏళ్లూ ఇదే తరహాలో కొనసాగించే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అయినా చైనా ఇప్పటిస్థాయిని భారత్ 2047కి అందుకోగలుగుతుందా అన్న ప్రశ్న వెంటాడుతూనే ఉంది.

**కీలక సూచీల గణాంకాలు**

| సూచీ | చైనా (2007) | భారత్ (2024-25) |
|---|---|---|
| తలసరిఆదాయం | 2700డాలర్లు | 2600 డాలర్లు |
| జీడీపీ వృద్ధి | 11-14% | 6-7% |
| తయారీరంగం వాటా | 32% | 15% |
| పట్టణీకరణ | 45% | 36% |
| ఎగుమతులవాటా | 9% | 2% |
| జనాభా సరళి | కార్మిక శక్తి గరిష్ట వయసుకి చేరటం | యువత భారీగా ఉండటం |

.. దీన్నిబట్టి చూస్తే, ఆదాయంపరంగా తప్ప, అభివృద్ధి వేగం పరంగా భారత్ వెనుకబడి ఉంది. ఆయా వ్యవస్థల పునాదిపరంగా చైనా కంటే భారత్ బలహీనంగా ఉంది.

చైనాకు లేని, భారత్ కు ఉన్న బలాలేమిటి?

2007లో చైనాకు లేని, 2026లో భారత్ కు ఉన్న బలాలు కొన్ని గణనీయమైనవి. అవి..పనిచేసేవారు, యువత, పాఠశాల విద్యార్థుల సంఖ్య; మానవాళి చరిత్రలో ఎన్నడూ లేని స్థాయి సాంకేతికత ఏఐ ఆవిష్కరణ, ప్రజాస్వామ్యం, వినూత్న ఆలోచనలు, వివిధ దేశాల్లో భారతీ యులు సాంకేతికత, స్టెమ్ తదితర ఆధునిక ఆర్థిక వ్యవస్థ రంగాల్లో నిపుణులుగా ఉండటం, బలమైన పునాదులు, మధ్యేవాద దృక్పథం, ధార్మిక చింతన ఉన్న సమాజం మొదలైనవి.

**ఇండియా బలహీనతలు**

అయితే ఈ బలాల్ని ఆర్థికంగా సద్వినియోగమయ్యే అవకాశాల్ని దెబ్బతీసే బలహీనతలు కూడా భారత్ ను పట్టిపీడిస్తున్నాయి. అందులో ప్రధానమైనవి ..నాణ్యమైన పాఠశాల విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం లేకపోవటం; చైనాను మించిన అధికార కేంద్రీకరణ వల్ల స్థానిక ప్రభుత్వాలు నిధులు, అధికారాలులేక బలహీనంగా ఉండటం, పౌర సేవలు కొంత మెరుగైనా ఇంకా ప్రామాణికంగా అందక పోవటం, గ్రామాల్లో, వ్యవసాయం మీద సగం జనాభా ఆధారపడటం, పనిచేసేవారిలో 80%కి పైగా అసంఘటిత రంగంలో ఉండటం, పట్టణీకరణ అస్తవ్యవస్తంగా మహా నగరాలకు పొట్ట చేత పట్టుకుని వలసల రూపంలోనే కొనసాగుతుండటం, ప్రజాస్వామ్యం పోలింగ్‌బూత్‌లో

స్వేచ్ఛగా ఓటింగ్, శాంతియుతంగా అధికార మార్పిడికే ఎక్కువగా పరిమితమై వినూత్న ఆలోచనలను, సామర్థ్యాలను నిరోధించేరీతిలోఎన్నికల్లో నల్లడబ్బుతో ఓట్ల కొనుగోలు, పార్టీల్లో అప్రజాస్వామికత పెరిగిపోవటం, పలు రాష్ట్రాలు అభివృద్ధిని పణంగా పెట్టి అప్పులు చేసి మరీ తాత్కాలిక వ్యక్తిగత పథకాలను అమలు చేయటం, చైనాకు కలిసొచ్చిన రీతిలో ప్రపంచీకరణ ఇప్పుడు భారత్‌కి అనుకూలంగా లేకపోవటం మొదలైనవి.

అయితే రాజకీయ సంకల్పం, పౌర సమాజంలో అవగాహన, మీడియాలో బాధ్యతాయుత వైఖరి ఉంటే.. కాస్త కష్టమైనా ఈ బలహీనతల్ని అధిగమించటం భారత్‌కి అసాధ్యం కాదు. ఆత్మవిశ్వాసం కోసం యూపీఐ, ఆధార్ సహా మనం సాధించిన కొన్ని విజయాల్ని చెప్పుకోవచ్చుగానీ, ఉపన్యాసాల కన్నా పరిష్కారాల మీద పనిచేయటం అత్యవసరం. జేపీ లాంటివారు నిర్దిష్ట పరిష్కారాల్ని రోజూ తెలియచేస్తున్నారు. నాణ్యమైన పాఠశాల విద్య, ప్రతి ఇంటికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, కాంట్రాక్టుల అమలు, రాత్రి వేళల వాణిజ్య కలాపాలు సవ్యంగా జరిగే మేరకైనా చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు 30%కి తగ్గకుండా నిధులు, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటం, వ్యవసాయం మీద ఆధారపడినవారిలో అత్యధికులకు ఆ పట్టణాల్లో తయారీ రంగంలో ఉపాధి కల్పించటం, స్వదేశీ మార్కెట్ స్థాయిని పెంచేందుకు పన్ను సంస్కరణలు మొదలైన చర్యలు తీసుకోవాలి. ఇంకా ఎక్కువ జనాభా అంటూ అసంబద్ధ ఆలోచనలు చేయకుండా, ఉన్న జనాభాలో చిట్టచివరి పౌరుని వరకూ ఎదిగే అవకాశాలను అందించటం మీద ముందు దృష్టి సారించాలి.

ఇవన్నీ ఒక తపస్సులా వచ్చే 25 ఏళ్లపాటు సమ్మిళిత అభివృద్ధే గీటురాయిగా చేస్తే, అప్పుడు భారత్ ఇప్పుడు చైనా ఉన్న స్థాయిని అందుకుంటుందని భరోసాగా భావించవచ్చు. ప్రస్తుత చైనా స్థాయిలో 18,000 డాలర్ల తలసరి ఆదాయం భారత్ కు 2047కి సాధ్యమని ఎస్.బీ.ఐ చెబుతున్నా, అంత సులభం కాదు. ఇదే నివేదికలో భారత్ 2030 నాటికి ఎగువ మధ్యాదాయ దేశంగా మారుతుందని ఎస్.బీ.ఐ పేర్కొంది. కానీ తలసరి ఆదాయం ఎంతట? 4,000 డాలర్ల పైచిలుకు. అంటే, ఎగువ మధ్యాదాయానికి ప్రారంభ స్థాయి మాత్రమే. 13,800 డాలర్ల పై చిలుకు వరకూ ఎగువ మధ్యాదాయమే. అంటే, అధికాదాయ దేశం కావటానికి ఎంత పెరగాలో ఆలోచించండి. కాబట్టి, అంకెల గారడీలో వాస్తవాల్ని విస్మరించి కలల్లో కాలయాపన చేయకుండా.. జేపీ చెబుతున్నట్లు ప్రభుత్వం తాను చేయాల్సిన బాధ్యతల్ని స్పష్టంగా గుర్తించి సక్రమంగా నెరవేరుస్తూ పైన పేర్కొన్న చర్యలను తీసుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ సంస్క రణల్ని వేగంగా అమలు చేయాలి. అప్పుడు 2047కి భారత్ చైనాను అధిగమించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మన చర్చ ఎంత హేతుబద్ధంగా, కార్యాచరణ ఎంత నిజాయతీగా ఉంటే అంత మేలు జరుగుతుంది.




**'మన దేశం ఎటుపోతోంది?' పుస్తకావిష్కరణ సభ హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఇటీవల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు,హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.**

## లోక్‌సత్తా సీనియర్ కార్యకర్త తిప్పారపు చంద్రమౌళి మృతి

హుస్నాబాద్ పట్టణానికి చెందిన లోక్‌సత్తా సీనియర్ నాయకుడు టి.చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. ఉద్యమ సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు..ఆయన మృతికి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, నాయకులు పందిళ్ల శంకర్‌రావు, మోహనరెడ్డి, నోముల చంద్రారెడ్డి, కోడెం లింగమూర్తి తదితరులు తమ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి ఉద్యమ సంస్థకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.






# ప్రజాస్వామ్యం స్థానిక స్థాయికి విస్తరించాలి: జేపీ

భారత్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ప్రజాస్వామ్యం స్థానిక స్థాయికి విస్తరించాలని, స్థానిక ప్రభుత్వాల బలం మీదే దేశ పునాదులుంటాయని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సంవాద్ ఉపన్యాస శ్రేణిలో భాగంగా విశాఖపట్నం గీతం డీమ్డ్ యూనివర్సిటీ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం-అభివృద్ధి' అంశంపై ఆయన ప్రసంగించారు. 'కేంద్రీకృత పాలనతో పోలిస్తే ప్రాంతీయ సమస్యలను స్థానిక ప్రజాస్వామ్యం మరింత సమర్థంగా పరిష్కరిస్తుంది. మన దేశం ప్రజాస్వామ్యమైనా.. చైనాతో పోలిస్తే స్థానిక ప్రభుత్వాలకు (ఇప్పటికీ వీటిని స్థానిక సంస్థలనే అంటుంటారు) ఆర్థిక, అధికారాల వికేంద్రీకరణలో వెనుకబడి ఉన్నాం. భారతదేశం వేగంగా అభివృద్ధి రేటును సాధిస్తున్నా.. స్థానిక ప్రభుత్వాలు బలంగా లేకపోవటం, పాఠశాల విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలలో నిధులను, సద్వినియోగాన్ని పట్టించుకోకపోవటంతో సమ్మిళిత, నాణ్యమైన అభివృద్ధి జరగటం లేదు' అని పేర్కొన్నారు. పేదరికాన్ని తగ్గించి ఆర్థికవృద్ధి, ఉత్పాదకతను పెంచటానికి నిర్దిష్ట రోడ్ మ్యాప్‌ను జేపీ వివరించారు. గీతం ప్రొ-వీసీ గౌతమ్ రావు, డైరెక్టర్ సుష్మారాజ్, ప్రొఫెసర్ బి. నళిని తదితరులు పాల్గొన్నారు.










కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసినందుకు గ్రీన్ కో కు హృదయపూర్వక అభినందనలు. 1950 మెగావాట్ల ఎలక్ట్రొలైజర్ సామర్థ్యంతో నిర్మిత మవుతున్న ఈ 1.5 ఎం.టి.పి.ఎ జీ.ఎన్.హెచ్3 ప్లాంట్ భారతదేశ ఇంధన పరివర్తన, అత్యంత విలువైన రసాయనాల ఉత్పత్తిలో కీలక మైలురాయి. మన ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చగల దార్శనికత, స్థాయి గల బృహత్ ప్రయత్నమిది. వికసిత్ భారత్ కోసం అటువంటి వినూత్న ఆలోచనలు, పెట్టుబడులు మనకు మరిన్ని అవసరం.

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (FDR), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th February 2026 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001





విశాఖపట్నం గీతం డీమ్డ్ యూనివర్సిటీలో 'ప్రజాస్వామ్యం-అభివృద్ధి'పై ప్రసంగించటానికి వచ్చిన ప్రజాస్వామ్యం పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో విశాఖ విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా సమావేశమైన యూనియన్ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, విష్ణుకుమార్ రాజు, లోక్ సత్తా ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు.

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**